
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
బుధవారం 23 అక్టోబరు 2024



ఉమ్మడి జడ్పీ కార్యాలయంలో బుధవారం ఓ విశేషం చోటు చేసుకోనుంది. జడ్పీ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఈ సమావేశానికి మహిళామణులు సారథ్యం వహించనున్నారు. జడ్పీ చైర్‌పర్సన్ జె.శారద, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్, జడ్పీ సీఈవో ఓబులమ్మ ఈ సమావేశాన్ని నిర్వహించనున్నారు. మహిళల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సమావేశంలో అయినా.. తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

మహిళామణుల సారథ్యంలో...

నేడు జడ్పీ సమావేశం

- సమస్యలపై చర్చ సాగేనా
- వ్యవసాయాన్ని గట్టెక్కించేనా
- పంటనష్టంపై ఊరట కలిగేనా
- తాగునీటి స్కీంల పనితీరు మెరుగుపడేనా
- నేతల గళంపై జనం గంపెడాశ

కడప రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు జడ్పీ మీటింగ్ హాలులో ఛైర్‌పర్సన్ జె.శారద అధ్యక్షతన నిర్వహించనున్నారు. అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు పాల్గొంటున్న ఈ సమావేశంలో జిల్లాలోని సమస్యలపై గళం విప్పి పరిష్కారం చూపుతారని భావిస్తున్నారు.

2024 ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగ, మినుము తదితర పంటలు పూర్తిగా ఎండిపోవడంతో బాధిత రైతులు వాటిని పశువులకు వదిలేశారు. దాదాపు 3,509 హెక్టార్లలో పంటలు ఎండిపోగా ఇందులో 2,858 హెక్టార్లలో మినుము, 651 హెక్టార్లలో వేరుశనగ ఉన్నట్లు వ్యవసాయాధికారులు నివేదికలను రూపొందించి ప్రభుత్వానికి పంపారు. అలాగే అక్టోబరు 15 నుంచి విస్తారంగా వర్షాలు పడుతుండడంతో ఖరీఫ్ చివరిదశలో నూర్పిళ్లకు సిద్ధంగా ఉన్న వరి, మినుము, మొక్కజొన్న పంటలు 1,132 మంది రైతులకు సంబంధించి 2241.66 ఎకరాలలో దెబ్బతిన్నాయి. ఇలా ఖరీఫ్‌లో అనావృష్టి, అతివృష్టి వర్షాల కారణంగా మొత్తంగా 10,941 ఎకరాలలో పంటలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఇలాంటి తరుణంలో ఖరీఫ్ కష్టాలను వెంటబెట్టుకొని రబీసాగుకు సమాయత్తమవుతున్న అన్నదాతకు అవసరమైన రుణాలను బ్యాంకు అధికారులు సకాలంలో అందించకుండా మీనమేషాలను లెక్కిస్తున్నారు. దీనికి తోడు వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు పూర్తిస్థాయిలో ఇసుక ప్రజలకు అందుబాటులోకి రావడం లేదు. పైగా ఇసుక, గ్రావెల్ అక్రమ తరలింపు సాగుతున్నప్పటికి అధికారుల చర్యలు కానరావడం లేదు. భవననిర్మాణ రంగం కుదేలు కావడంతో పనులులేక కూలీలు వలసబాట పట్టారు. ఇక జిల్లాలో పారిశుధ్యం పడకేసింది. డ్రైనేజీ కాలువలు శుభ్రపరిచేవారే కరువయ్యారు. వెరసి ప్రజలు దోమకాటుకు లోనై విషజ్వరాల బారిన పడుతున్నారు. ప్రస్తుత వర్షాలకు చాలా వరకు పాఠశాలలు ఉరుస్తున్నాయి. వైద్యశాలల్లో మందుల కొరత వేధిస్తోంది. వీటన్నింటిపై చర్చసాగించి ప్రజలకు న్యాయం చేయాల్సిన గురుతర బాధ్యత ప్రజాప్రతినిధులపై ఎంతైనా ఉంది. కానీ పై సమస్యలపై...

మిగతా 6వ పేజీలో..



జిల్లా పరిషత్ కార్యాలయం

రీసర్వే ప్రక్షాళన షురూ


- వైసీపీ హయాంలో భూరక్ష పేరుతో రీసర్వే..
- పొలాల్లో జగన్ పేరు, బొమ్మతో సర్వే రాళ్లు
- రైతుల పాసుపుస్తకాల్లోనూ జగన్ బొమ్మలు
- రైతుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు
- దిద్దుబాటుకు దిగిన కూటమి ప్రభుత్వం
- 283 గ్రామాల్లో గ్రామ సభలు
- 3,11006 రీసర్వే రాళ్లపై జగన్ పేరు తొలగింపుపై దృష్టి



పెండ్లిమర్రిలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

కడప(కలెక్టరేట్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో చేపట్టిన భూ సర్వేపై అప్పట్లోనే రైతుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది. డ్రోన్లు, శాటిలైట్‌కు అనుసంధానంతో ఆధునిక యంత్రాలతో చేపట్టిన రీసర్వేలో రెవెన్యూ రికార్డుల్లో ఉన్న భూములకంటే తక్కువగా చూపడం, హద్దుల్లో వ్యత్యాసాలు ఉండడం రైతులను కలవర పెట్టింది. ఇవే కాక.. రెవెన్యూ పరంగా రికార్డుల్లో పేర్లు తప్పులు దొర్లడం, ఎవరిపేరుతో లేని భూములను వైసీపీ పెద్దలు బీనామీల పేర్లతో గోల్‌మాల్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అప్పటి జగన్ ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలతో బాధితులుగా మారిన రైతులు ఇటీవల పెద్ద ఎత్తున చంద్రబాబు కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో భూ ప్రక్షాళనకు కూటమి సర్కారు నడుం బిగించడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమౌతోంది.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్ జిల్లావ్యాప్తంగా వైసీపీ పాలన సమయంలో జరిగిన భూముల రీసర్వేను చక్కదిద్దే చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రెవెన్యూ, సర్వేశాఖలు సమన్వయంతో గ్రామసభలు నిర్వహిస్తున్నాయి. జిల్లాలో 736 గ్రామ పంచాయతీలకు గాను అప్పట్లో 283 గ్రామాల్లో దాదాపు 1.40 లక్షల ఎకరాల భూముల రీసర్వే పనులు జరిగాయి. ఈ మేరకు భూములను కమతాలుగా విభజించి 3.11 లక్షల జగనన్న బొమ్మలతో ఉన్న రీసర్వే రాళ్లను నాటారు. ప్రతి ఎకరాకు ఈ రాళ్ల నాటడంతో ట్రాక్టర్, ఎద్దులతో చేసే వ్యవసాయానికి ఆటంకంగా మారాయని రైతులు



ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమస్యలను చక్కబెట్టి రైతుల నుంచి ఫిర్యాదులు అందిన 15 రోజుల్లో న్యాయం జరిగేలా భూప్రక్షాళన ప్రక్రియ ఈ నెలాఖరు వరకు చేపట్టేందుకు అధికారులు ముందుకు పోతున్నారు.

రోజుకు 20-25 గ్రామసభలు

గత ప్రభుత్వ హయాంలో భూముల రీసర్వేతో పాటు, రెవెన్యూశాఖలో భూ రికార్డుల నమోదులో దొర్లిన తప్పులను చక్కబెట్టి రైతులకు న్యాయం చేసేలా ప్రతిరోజు 20-25 గ్రామ సభలు నిర్వహించేలా రెవెన్యూ, సర్వే శాఖలు ప్రణాళికలతో ముందుకెళుతున్నాయి. గ్రామసభలు ఏర్పాటు చేసే గ్రామాల్లో ముందుగానే టాం టాం ద్వారా రైతులను అప్రమత్తం చేస్తున్నారు. రీసర్వే భూ సమస్యలపై గ్రామ సభల్లో ఫిర్యాదులు స్వీకరించడంతో పాటు 15 రోజుల్లో వీటిని పరిష్కరించనున్నారు. గత శనివారం నుంచి గ్రామసభలు ప్రారంభమైనప్పటికీ ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా అనుకున్న ప్రకారం ఈ సభలు నిర్వహించడంలో జాప్యం జరిగింది.

జగనన్న రీసర్వే
3,11,006 రాళ్ల శుద్ధికి కసరత్తు

వైసీపీ హయాంలో జిల్లాలో జరిగిన భూముల రీసర్వేకు సంబంధించి జగన్ బొమ్మ, పేర్లతో ఉన్న 3,11,006 ఉపయోగించారు. వీటిని ఆగమేఘాల మీద భూ హక్కుదారులైన రైతులకు ఏమాత్రం సంబంధం లేకుండా వారి పొలాల్లో నాటించారు. దీంతో రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అయింది. అంతేకాకుండా రీ సర్వే చేసిన భూములకు సంబంధించి ఇచ్చిన పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మ పెద్దదిగా ఉండడంతో పెద్ద దుమారం రేగింది. దీనిని గుర్తించిన చంద్రబాబు సర్కారు రైతులకు మేలు జరిగేలా ఇప్పటికే జగన్ బొమ్మతో ఉన్న పాస్ పుస్తకాలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంతే కాకుండా కొత్తగా జారీ చేసే పాస్ బుక్కుల్లో రాజముద్ర, భూ హక్కుదారుడు ఫొటోలు ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో జిల్లాల్లో గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన 66 వేల పాస్ బుక్కులు మాయం కానున్నాయి. ఇక పోతే జగన్ బొమ్మలతో ఉన్న 3,11,006 రీ సర్వే రాళ్లను శుద్ధిచేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రీసర్వే రాళ్లపై జగన్ బొమ్మలు, పేర్లు తొలగించాలంటే పెయింటింగ్ వేయాలా? లేక ఉప్పుకాగితంతో రుద్దాలా? అనే విషయంలో అధికారులు సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రెండింటిలో ఏది చేసినా ప్రభుత్వానికి ఖర్చు తడిసిమోపెడవుతుందని అంటున్నారు.

జగన్ సర్కారులో ఆర్భాటంగా చేపట్టిన భూముల రీ సర్వే వివాదాస్పదమైంది. రైతుల ప్రమేయం లేకండా భూముల రీసర్వే చేపట్టడం, అన్నదమ్ముల భాగపరిష్కార భూములన్నింటిని విభజించకుండా ఒకే సర్వే నెంబరులో ఉంచడం పెద్ద సమస్యగా మారింది. వైసీపీ హయాంలో చేపట్టిన భూ సర్వేను ప్రక్షాళన చేసేందుకు, రైతుల్లో నెలకొన్న సందేహాలు తీర్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం రెవెన్యూ, సర్వేశాఖ అధికారుల బృందాలు గ్రామసభలు నిర్వహించనున్నాయి. ఈ బృందంలో తహశీల్దారు, డిప్యూటీ తహశీల్దారు, వీఆర్వో, డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్, మండల సర్వేయర్‌తో పాటు విలేజ్ సర్వేయర్, అధికారులు గ్రామసభల్లో పాల్గొని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. ఇవన్నీ ఒకెత్తు అయితే.. వైసీపీ హయాంలో చేపట్టిన భూసర్వే సమయంలో పొలాల్లో పాతిన రాళ్లపై ఉన్న జగన్ బొమ్మ, పేర్లను తొలగించడం అధికారులకు ఇప్పుడు తలకు మించిన భారంగా మారింది. పెయింట్ వేస్తే కొంతకాలానికి పోతుంది.. ఉప్పుకాగింత రుద్దితో ఖర్చు ఎక్కువ అవుతుంది. దీంతో వీటిని ఎలా తొలగించాలో అర్థంకాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

భూముల రీసర్వే ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

- మురళీ కృష్ణ, జిల్లా భూములు రికార్డులు, కొలతల శాఖ అధికారి



రీ సర్వే సమయంలో ఎక్కువగా అన్నదమ్ముల భూముల భాగ పరిష్కార నమోదుకు సంబంధించిన సమస్యలు ఉన్నాయి. అలాగే గత సర్కారులో జగన్ బొమ్మతో ఉన్న రీసర్వే రాళ్లను శుద్ధి చేసేలా కార్యాచరణ చేస్తున్నాం. రైతుల భూములకు సంబంధించి రీ సర్వే సమస్యలు పరిష్కరిస్తాం. రైతుల నుంచి ఫిర్యాదులు తీసుకున్న 15 రోజుల్లో రీ సర్వే సమస్యలు, జాయింట్ ఎల్పీఎం సమస్యలు చక్కదిద్దేలా చర్యలు తీసుకుంటున్నాం.

నేడు జగన్ రాక

బద్వేలు/పులివెందులటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణానికి చెందిన బాలిక మూడు రోజుల క్రితం హత్యకు గురైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు బుధవారం మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రానున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. గుంటూరు నుంచి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం జగన్ ఇక్కడకు చేరుకుంటారు. అనంతరం ఇక్కడి నుంచి 3గంటలకు హెలికాప్టర్ ద్వారా పులివెందుల వెళతారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. రెండురోజుల పాటు పులివెందులలో నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని సమాచారం. ఈ నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి గోపవరం మండలం పీపీ కుంట వద్ద హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు.

రేపు పెన్షన్, జీపీఎఫ్ అదాలత్

కడప కలెక్టరేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ అయిన ఉద్యోగులకు సంబంధించి జీపీఎఫ్, పెన్షన్ సమస్యల పరిష్కారం కోసం 24వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని సభాభవన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఖజానా శాఖ ఉప సంచాలకులు ఎంఎస్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిన్సిపల్ అకౌంట్ జనరల్ విజయవాడ సంచాలకులు, రాష్ట్ర ఖజానా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ అదాలత్ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు హాజరై పెన్షనర్లకు సంబంధించిన జీపీఎఫ్, పెన్షన్ సమస్యలను తెలియజేస్తే వారి సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొలంలో కుంగిన భూమి



నల్లగొండువారిపల్లెలో కుంగిన భూమి

పులివెందుల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓ రైతు పొలంలో ఉన్నట్లుండి భూమి దాదాపు ఆరు అడుగుల లోతుకు కుంగిపోయిన సంఘటన పులివెందుల మండలం నల్లగొండువారిపల్లెలో చోటుచేసుకుంది. సోమవారం ఉదయం నల్లగొండువారిపల్లెకు చెందిన చంద్రమౌళి పొలంలో అతని కుమారుడు నవీన్‌కుమార్ మందు పిచికారీ చేస్తుండగా ఒక్కసారిగా భూమి కుంగిపోయింది. దీనితో నవీన్‌కుమార్ కూడా అందులో పడిపోయారు. గమనించిన స్థానిక రైతులు నవీన్ కుమార్‌ను పైకి లాగారు. కాగా చంద్రమౌళి పొలంలో ఇలా పొలం కుంగిపోవడం ఇది రెండవసారి. దీనిపై పలువురు రైతులు మాట్లాడుతూ ఈ గ్రామంలో గత ఏడేళ్లలో ఇలాంటి గుంతలు దాదాపు ఐదు ఏర్పడ్డాయని అన్నారు. భూమి కుంగిపోవడం గురించి సంబంధిత అధికారులు ఇక్కడ పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేయాల్సి ఉంది.



అదే రైతు పొలంలో ఐదేళ్ల కిందట కుంగిపోయిన భూమి

ఈగల్ డిస్టిలరీలో సీఐడీ సోదాలు

- ఉదయం నుంచి సాగుతున్న తనిఖీలు

కడప క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలో ఉన్న ఈగల్ డిస్టిలరీ ఫ్యాక్టరీలో సీఐడీ అధికారులు సోదాలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిస్టిలరీ ఫ్యాక్టరీలలో సీఐడీతో పాటు ఎక్సైజ్ అధికారులు కలిసి ఈ సోదాలు కొనసాగిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సోదాలు కొనసాగుతున్నాయి. డిస్టిలరీలోని రికార్డులను పరిశీలిస్తున్నారు. అలాగే మద్యం తయారు చేసే పదార్థాలను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గతంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు కూడా ఈ డిస్టిలరీలో తనిఖీలు నిర్వహించి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం కూడా సీఐడీ అధికారులు ఇక్కడ తనిఖీలు నిర్వహించి పలు రికార్డులను పరిశీలించడంతో పాటు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. మద్యం తయారీకి ఉపయోగించే పదార్థాల శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు సమాచారం. అయితే డిస్టిలరీ ఫ్యాక్టరీలోకి ఎవరినీ అనుమతించలేదు.



సీఐడీ అధికారులు తనిఖీ చేస్తున్న ఈగల్ డిస్టిలరీ ఇదే

ఎమ్మార్పీకే విక్రయాలు

- మద్యం కల్తీ చేస్తే చర్యలు
- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్



ముఖాముఖి

(కడప-ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీలో భాగంగా జిల్లాలో ఇటీవలే ప్రైవేటు మద్యంషాపులు అందుబాటులోకి వచ్చాయి. ఐదేళ్ల కిందట ఉన్న అన్ని బ్రాండ్లు వచ్చేశాయి. నూతన మద్యం పాలసీలో భాగంగా విక్రయాలు సాగించడంతో అమ్మకాలలో దుకాణాలు సమయపాలన పాటించాల్సి ఉంది. ఏవైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్మాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ వెల్లడించారు. ఆయన మాటల్లోనే..

ప్రశ్న: ఎన్ని మద్యం షాపులున్నాయి. ఎన్ని ప్రారంభం అయ్యాయి

జవాబు: జిల్లాలో 139 మద్యంషాపులకు గాను 133 ప్రారంభం అయ్యాయి. కడప ఎక్సైజ్ పరిధిలో 2, జమ్మలమడుగు 2, ఎర్రగుంట్ల 2షాపులు తెరవాల్సి ఉంది. దుకాణాల సమస్య కారణంగా ఇంకా ప్రారంభం కాలేదు.

ప్రశ్న: రోజూ ఎన్ని కోట్ల వ్యాపారం జరుగుతోంది

జవాబు: కడప, ప్రొద్దుటూరులో ఎక్సైజ్ డిపోలున్నాయి. ప్రొద్దుటూరు డిపో పరిధిలో 101 మద్యం షాపులు ఉండగా, కడప డిపో పరిధిలో 101 షాపులున్నాయి. ఇందులో 38 కడప జిల్లాకు సంబంధించినవి. మిగతా షాపులు అన్నమయ్య జిల్లావి. రెండు డిపోల పరిధిలో రోజూ రూ.10 కోట్ల మేర సేల్స్ జరుగుతున్నాయి.

ప్రశ్న: షాపుల వద్దనే తాపిస్తున్నారు

జవాబు: ఉదయం 10గంటల నుంచి రాత్రి 10 వరకు మాత్రమే మద్యం షాపులు తెరవాలి. మద్యం షాపుల వద్ద తాపించకూడదు. అలా చేస్తే చర్యలు తీసుకుంటాం.


ప్రశ్న: బెల్టుషాపులు మొదలయ్యాయి

జవాబు: ఇంకా షాపులకు పూర్తిస్థాయి లైసెన్సు ఇవ్వలేదు. ప్రొబెషనరీ లైసెన్సు మాత్రమే ఇచ్చాం. అన్నీ సెట్ అయిన తరువాత షాపుల నిర్వహణకు రూము దొరికాక డోరు నెంబరుతో సహా పర్మినెంటుగా లైసెన్సు ఇస్తాం. బెల్టుషాపులు ఏర్పాటుచేస్తే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: కల్తీ మద్యం ఇతరత్రా వాటిపై...

జవాబు: ఎక్సైజ్ పరిధిలో టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు ఉన్నాయి. కల్తీ మద్యం, బెల్టుషాపులపై ఫిర్యాదు వస్తే వెంటనే దాడులు నిర్వహిస్తారు. సమయపాలన మద్యం కల్తీ ఇలాంటివన్నీ తనిఖీ చేస్తారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.

వరద నీటితో జలకళ



కళకళలాడుతున్న రిజర్వాయర్

లింగాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె సమీపంలో ఉన్న పెంచికల బసిరెడ్డి రిజర్వాయర్‌కు వరదనీరు పోటెత్తడంతో జలకళ సంతరించుకుంది. ఎగువ ప్రాంతంలో మంగళవారం తెల్లవారుజామున భారీ వర్షం కురవడంతో చిత్రావతి నదికి వరదనీరు పెత్త ఎత్తున చేరుతోంది. మంగళవారం ఉయం 100 క్యూసెక్కులతో ప్రారంభమైన వరదనీరు సాయంత్రానికి సుమారు 10వేల క్యూసెక్కులకు పెరిగిందని ప్రాజెక్టు ఈఈ రాజశేఖర్ తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 7.5 టీఎంసీల నీరు ఉందని ఆయన తెలిపారు.

స్కిల్ హబ్ ఉద్యోగులకు నైపుణ్య, సామర్థ్య పరీక్షలు

- సీఎన్‌సీ యంత్రాలను పరిశీలించిన డీఎస్డీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కడప కలెక్టరేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో జిల్లాలో ఏర్పాటైన స్కిల్ హబ్‌ల లొసుగులు, నిర్వహణపై ఇటీవల 'స్కి(ని)ల్ హబ్' అంటూ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో గణేశ్ కుమార్ సీరియస్‌గా తీసుకున్నారు. ప్రస్తుతం స్కిల్ హబ్‌లల్లో పనిచేసే ఉద్యోగులందరి నైపుణ్య సామర్థ్యాలను తెలుసుకునేందుకు పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఈమేరకు మంగళవారం రాష్ట్ర ఎండీ ఆదేశాలు జారీ చేశారు.

కాగా జగన్ పాలనలో యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు నియమించిన ఉద్యోగుల్లో ఎక్కువ మంది నాన్‌టెక్నికల్ ఉద్యోగులు ఉన్నారని తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా చంద్రబాబు హయాంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చారు. ఇందుకోసం అప్పట్లో తెచ్చిన కోట్లాది రూపాయల యంత్రాలను జగన్ సర్కారులో స్కిల్ హబ్‌ల పేరుతో నిరుపయోగం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి వినీత్ కుమార్, ఏడీఎస్డీవో మల్లికార్జున రెడ్డిలు రామకృష్ణ కళాశాలలో ఉన్న కోటి రూపాయల విలువైన సీఎన్‌సీ యంత్రాలను, అలాగే కడప ఐటీఐలో ఉన్న యంత్రాలను పరిశీలించారు. యంత్రాలు శిక్షణా కేంద్రాల బయట ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారని సమాచారం.

రావణుడితో వాదులాడుతున్న హనుమంతుడు




తోలుబొమ్మలాట

కనుమరుగవుతున్న ప్రాచీన కళలు
ఆదరణ కోల్పోతున్న కళాకారులు
ప్రత్యామ్నాయం వైపు అడుగులు
తొలి ప్రధాని మెచ్చిన ప్రాచీన కళ



పోరుమామిళ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జానపద కళారూపం తోలుబొమ్మలాట భారతదేశంలో ఎంతో ప్రసిద్ధి చెందింది. చర్మంతో తయారు చేసిన వివిధ బొమ్మలతో కథని తయారు చేసి జానపద కావ్యాలు, పురాణాల్లోని పాత్రలను సృష్టించుకుని తన భాషతో మూగచిత్రాలకు ప్రాణం పోశారు. చూపరులను అబ్బురపరిచేలా వాటిచేత రకరకాల విన్యాసాలు చేయించారు. తెరవెనుక ఉండి పాత్రలను కదిలిస్తూ జీవంలేని బొమ్మలతో జీవనిబద్ధమైన ఒక దృశ్యాన్ని ప్రదర్శించడంలో జానపదుడి కళాత్మకం దాగివుంది. క్రీస్తుపూర్వం 3వ శతాబ్ధంలో తోలుబొమ్మలాటలు ఎక్కువగా ప్రదర్శించబడేవి. అప్పటి జనుల వేడుకలో తోలుబొమ్మలాట ఒకటి. ప్రాచీన కాలంలో తోలుబొమ్మలాటకు మంచి ప్రాధాన్యత, కళాకారులకు ప్రోత్సాహం, ఆదరణ ఉండేది. అప్పట్లో తోలుబొమ్మలాట బహుళ ప్రజాదరణ పొందింది. విజయనగర రాజుల కాలంలో కాలుడు అనే గొప్ప తోలుబొమ్మలాట కళాకారుడు ఉండేవాడని, ఆటలో అందె వేసిన వారని పెద్దలు చెబుతుండేవారు. ఆయన నైపుణ్యాన్ని చూసిన ఓ కవి తన కవిత్వాన్ని అతనికి అంకితం ఇచ్చాడంటే అప్పటి కాలంలో తోలుబొమ్మలాటకు ఆదరణ ఎంత ఉండేదో ఇట్టే అర్థమవుతోంది. తోలుబొమ్మలు ప్రదర్శించడంలో అనేక కొత్త పద్దతులు కనిపెట్టి ప్రజల మన్ననలు పొందేవారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఈ కళపట్ల ఆసక్తి కనబరచడంతో రాచాయిపేటకు చెందిన బాలిరెడ్డి సహకారంతో అప్పటి కళాకారులు ఢిల్లీకి వెళ్లి ప్రధాని ఎదుట ప్రదర్శనలు ఇచ్చారుట. తోలుబొమ్మలాట ప్రదర్శనలకు ఎడ్ల బండ్లలో వెళ్లి వీక్షించేవారు. టీవీలు, సినిమాలు వచ్చిన తరువాత వాటి ప్రాధాన్యత తగ్గడమే కాక ప్రాచీన కళలు కనుమరుగై పోతున్నాయి. కదిలే తోలుబొమ్మల ప్రదర్శన గురించి తెలుసుకోవాలంటే తాతయ్య, అమ్మమ్మను అడిగి తెలుసుకోవాల్సిన పరిస్థితి.



తోలుబొమ్మలను మోస్తున్న కళాకారుడు

కడప జిల్లాలో సుమారు 50 ఏళ్లకు ముందు కలసపాడు మండలం శింగరాయపల్లె నుంచి 40 కుటుంబాలకు పైగా పోరుమామిళ్ల ప్రాంతానికి వలస వచ్చి నివాసం ఉంటూ ప్రదర్శనలు ఇస్తుండేవారు. ఎక్కువగా భారతం, విరాట పర్వం, భీష్మపర్వం, పద్మవ్యూహం, సైంధవ వధ, కర్ణపర్వం, ధృవపర్వంలాంటి ప్రదర్శనలు ఇచ్చేవారు. ఎక్కువగా కేతిగాడు, బంగారక్క, జుట్టు పోలిగాడు, బుడ్డకేతిగాడు ప్రతి ప్రదర్శనలో ఉండేలా వీరు నాటకాన్ని తీర్చిదిద్దేవారు. కేతిగాడి చిలిపి చేష్టలు, వారి మాటలకు జనాలు ఆనందంగా నవ్వుకునేవారు. చరిత్ర ప్రసిద్ధిగాంచిన తోలుబొమ్మలాట దేశ విదేశాల్లో సైతం ప్రజాదరణ పొందిందనడంలో అతిశయోక్తి లేదు. ఆ కళాకారులకు విదేశీయులతో సత్సంబంధాలుండడంతో విదేశాల్లో కూడా ఈ కళాకారులు వెళుతుండేవారు. ప్రాచీన ఓడరేవులైన భీమునిపట్నం నుంచి వ్యాపార నిమిత్తం భారతీయ వర్తకులు విదేశాలకు వెళుతుండేవారు. వీరితో కలిసి బొమ్మలాట కళాకారుల బృందాలు కూడా వెళ్లేవి. ఇలా విదేశాల్లో తోలుబొమ్మలాట ప్రచారానికి వచ్చిందని తెలుస్తోంది. 17వ శతాబ్ధం నాటి పారిస్, ఫ్రాన్స్, ఇటలీ దేశాల్లో ఈ ఆటకు ఆదరణ దక్కింది.

తోలుబొమ్మల తయారీ...

చర్మాలను నిలువునా సాగదీసి వాటిని ఎండబెట్టి భద్రపరిచి బొమ్మల అవయవాలు కదిలేలా భాగాలు కత్తిరించి కదిలేందుకు అనువుగా అమర్చుతారు. దీంతో ప్రజలు చక్కని వినోదం పొందేవారు. తోలుతో బొమ్మలు చేసి ఆడించడంతో తోలుబొమ్మలాటగా పేరు వచ్చింది. సంస్కృతంలో ఛాయానాటకంగా పిలుస్తారు. బొమ్మలాట తెరకు వెలుతురు కనబడని ముతక వస్త్రాన్ని ప్రత్యేకంగా ఉపయోగించేవారు. దాదాపు 24 అడుగులు తెర వెనుక 12 అడుగుల ఖాళీస్థలంలో వాయిద్య కళాకారులు పాటలు పాడేవారు. ప్రదర్శన కోసం అప్పట్లో ఆముదపు దీపాలు, కాగడాలు ఉపయోగించేవారు. కాలక్రమేణా ఎరుపు ట్యూబులైట్లతో బొమ్మలను ఆడించేవారు. బొమ్మకు కొక్కీలు ఏర్పాటు చేసి కళాత్మకంగా బొమ్మలను ఆడిస్తూ వినోదం అందించేవారు.

తగ్గిన ఆదరణ

తోలుబొమ్మలాటకు రానురాను ఆదరణ తగ్గింది. అప్పుడప్పుడూ టీవీల్లో ఆదివారం ప్రత్యేకించి ఈ ప్రదర్శనలు ఇచ్చేవారు. ఇప్పుడు చూడాలంటే ఏ తెలుగు మహాసభల కోసమో, సాంస్కృతిక చిహ్నంగా ప్రదర్శిస్తుంటారు. ప్రస్తుతం కాలగర్భంలో కలిసిన గ్రామీణ కళల జాబితాలో చేరుతోంది. తోలుబొమ్మలాట కళాకోవిదుల బతుకుదెరువుపై గీతాలాపనే ఇప్పుడిక మిగిలింది. మహోన్నత చరిత్ర కలిగి దేశ విదేశాల్లో ఆహ్లాదం, వినోదం అందించిన తోలుబొమ్మలాటలు నేడు పూర్తిగా కనుమరుగయ్యాయి. వాటిని నమ్ముకున్న కళాకారులు వీధిన పడ్డారు. సరైన ఆదరణ లేకపోవడంతో తోలుబొమ్మలు ఆడించి పొట్ట పోసుకుని జీవనం సాగించే కళాకారులు వీధినాటకం ఆడే భాగవతులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు. పాశ్చాత్య నాగరికతకు అలవాటు పడ్డ సమాజం గతంలో తోలుబొమ్మలాట ఉందనే విషయం కూడా మరిచారు. రాజులను సైతం మైమరిపించిన ఈ ఆటను తిరిగి తెరపైకి తెచ్చేందుకు ఎవరూ ప్రయత్నించడం లేదనడంతో సందేహంలేదు.

ప్రభుత్వ పథకాల్లో ప్రచారం...

ప్రభుత్వ పథకాల ప్రచారంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు అవకాశం ఇచ్చారు. కళనే నమ్ముకున్న కొందరు కళపై మక్కువను వదులుకోక తిరుణాళ్ల, జాతర వంటి క్షేత్రాల్లో గ్రామస్తుల కోరిక మేరకు ప్రదర్శనలు ఇస్తున్నారు. మహా భారతం, రామాయణం, ప్రమీలార్జునీయం, విరాట పర్వం, భీష్మపర్వం, పద్మవ్యూహం, సైంధవవధ, కర్ణపర్వం, ధృవ పర్వం ప్రదర్శనలు ఇచ్చేవారు. కేతిగాడు, బంగారక్క, జుట్టు పోలిగాడు, బుడ్డకేతిగాడు ప్రదర్శనలో కీలకంగా ఉండేవారు. ముఖ్యమంత్రి ద్వారా అవార్డులు కూడా అందుకున్నారు.

తొలి ప్రధాని మెచ్చిన కళ

తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఈ కళ గురించి విని ఆసక్తి కనబరచడంతో అప్పటి కళాకారులు ఢిల్లీలో ప్రదర్శనలు ఇచ్చారు. రాచాయిపేటకు చెందిన బాలిరెడ్డి సహకారంతో వెంకట్రావు, సుబ్బారావు, గోవిందరావు, రామోజీరావు, క్రిష్ణారావు, ఎరికలమ్మ, జానకమ్మ బృందం ఢిల్లీలోని సర్వదేవాపురం వద్ద పద్మ యాగం, సైంధవవధ బొమ్మలాట ప్రదర్శించారని అప్పటి కళాకారులు చెబుతున్నారు. ఈ కళకు ఉన్న ఆదరణ గురించి తోలుబొమ్మలాట కళాకారిణి జానకమ్మ ఓ పత్రికలో తన జ్ఞాపకాలను నెమరువేసుకుందని వనపర్తి పెద్దమునిరావు తెలిపారు. ఆమెకు చదువు రాక పోయినా రామాయణం, భాగవతఘట్టాలు ఆకట్టుకునేలా కథనం చెప్పేవారు. ప్రధాని నెహ్రూ కళాకారుల ప్రదర్శనలు వారం రోజులు వీక్షించి వారిని ఆదరించారని ఇప్పటి కళాకారులు తెలిపారు.

50 ఏళ్లుగా ఈ వృత్తిలోనే..



50 ఏళ్లగా తోలుబొమ్మలాటనే నమ్ముకుని ఉన్నాం. తోలుబొమ్మలాట ప్రదర్శనకు చుట్టుపక్కల గ్రామాల వారు వచ్చే వారు. క్షేత్రస్థాయిలో జరిగే కార్యక్రమాలకు ఆహ్వానం అందితే గ్రూపు సభ్యులు వెళ్లి ప్రదర్శనలు ఇచ్చి, వారిచ్చే కానుకలను స్వీకరించే వారం. జన్మభూమి, కడప వారోత్సవాలు వంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో తమను ఎంతో ప్రోత్సహించే వారు. ఇప్పటికైనా కళాకారులను ఆదరించి ప్రాచీన కళలకు ప్రాణం పోసేలా చర్యలు తీసుకోవాలి.

- వనపర్తి పెద్దమునిరావు, ఎస్టీకాలనీ, రంగసముద్రం, పోరుమామిళ్ల

కళాకారులకు తగ్గిన ఆదరణ



తోలుబొమ్మలాట కళాకారులకు నేడు ఆదరణ లేదు. తమ కళలను ఎవరూ పట్టించుకోవడం లేదు. వయోభారంతో పని చేయలేక తరతరాలుగా వస్తున్న వృత్తిని వదలుకోలేక కొనసాగిస్తున్నాం. ప్రస్తుతం కార్యక్రమానికి వెళితే గ్రూపునకు రూ.15వేలు ఇస్తున్నారు. ఆ డబ్బుతోనే జీవిస్తున్నాం. కళాకారులకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉంది.

- నరసింహులు, ఎస్టీకాలనీ, పోరుమామిళ్ల



అప్పటి సీఎం చంద్రబాబు నుంచి జ్ఞాపిక అందుకుంటున్న పెద్ద మునిరావు (ఫైల్)





తోలుబొమ్మలాట కళాకారుల ర్యాలీ - తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వద్ద తోలుబొమ్మలాట ప్రదర్శించిన జానకమ్మ (ఫైల్)

మహిళామణుల సారథ్యంలో...

నేడు జడ్పీ సమావేశం

(5వ పేజీ తరువాయి)

ఎంతమేర చర్చజరుగుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు ప్రజలు మాత్రం జిల్లాలోని సమస్యలపై ప్రజాప్రతినిధులు గళంవిప్పి పరిష్కారం చూపుతారనే గంపెడాశతో ఎదురుచూస్తున్నారు.

శాఖల వారీగా పరిశీలిస్తే...

- 2024 ఖరీఫ్ పంటలకు కష్టకాలం దాపురించింది. నైరుతి రుతుపవనాలు అసమతుల్య వర్షాలను కురిపించడంతో వర్షాధారం పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో 403.3 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 299.5 మి.మీ మాత్రమే నమోదవడంతో చాలా వరకు పంటలు ఎండిపోయాయి. ఇప్పటికే వేరుశనగ, మినుము తదితర పంటలు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు పశువులకు వదిలేశారు. 2024 ఖరీఫ్‌లో 75,189 హెక్టార్లు సాగు లక్ష్యం కాగా 51,518 హెక్టార్లు మాత్రమే సాగుకు నోచుకున్నాయి. ఇందులో వర్షాభావ పరిస్థితుల కారణంగా 8,700 ఎకరాలు, అతివృష్టి వర్షాల కారణంగా 2,241 ఎకరాల్లో పంటలు దెబ్బతిని రూ.కోట్లలో పంట నష్టం వాటిల్లడంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. ఇందుకు సంబంధించిన నష్టపరిహారం, పంటల బీమా పథకం, ఇన్‌పుట్ సబ్సిడీలు జిల్లా రైతులకు సక్రమంగా అందడంలేదు. వీటిపై ప్రధానచర్చ జరగాల్సి ఉంది.
- ఉమ్మడి కడప జిల్లాలోని బాల, బాలికల వసతిగృహాల నిర్వహణకు మంజూరైన నిధులు ఖర్చు చేస్తున్నా 60శాతం వసతి గృహాల్లో తాగునీరు ఇతర మౌలిక వసతులు లేక విద్యార్థులు అల్లాడుతున్నారు. బీసీ సంక్షేమం ద్వారా బీసీ, ఈబీసీ విద్యార్థులకు గతేడాదికి సంబంధించిన పోస్ట్‌మెట్రిక్ స్కాలర్ షిప్పులు చాలా మందికి విడుదల కావాల్సి ఉంది. మైనార్టీ సంక్షేమం కింద ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై సభ్యులు చర్చించాల్సి ఉంది.
- ఉమ్మడి కడప జిల్లాలో సమగ్ర శిశు అభివృద్ధి పథకం ద్వారా జిల్లాలోని 15 ఐసీడీఎస్ ప్రాజెక్టుల ద్వారా గ్రామ స్థాయిలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు చాలా వరకు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిలో మౌలిక సదుపాయాలైన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతరత్రా లేక ఇబ్బంది పడుతున్నారు. ఇక బాలకార్మికులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాల్సిన ఐసీడీఎస్ ఆధికారులు దాన్ని పూర్తిగా మరిచిపోయారనే ఆరోపణలున్నాయి. వీటిపై చర్చ జరగాల్సి ఉంది.
- జిల్లాలో గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే సీపీడబ్ల్యూఎస్ స్కీంల పనితీరు లోపభూయిష్టంగా మారింది. వీటికి సంబంధించి ఇటీవల జరిగిన టెండర్లు నిబంధనల ప్రకారం కాకుండా ఇష్టానుసారం చేపట్టారనే ఆరోపణలున్నాయి. వర్షాలు కురుస్తున్నా జిల్లాలో చాలా చోట్ల తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కడప నగరంలో ఐదురోజులకు ఒకసారి మంచినీటిని సరఫరా చేశారు. ఈ నేపథ్యంలో వాటర్‌స్కీంపై సమావేశంలో చర్చించాల్సిన అవసరం ఉంది.
- ఉమ్మడి కడప జిల్లాలో చిన్న, మధ్యతరహా, భారీ నీటివనరుల నిర్మాణాలున్నాయి. ఇందులో 1,841 చిన్ననీటిపారుదల వనరుల ద్వారా 1,11,225 ఎకరాల ఆయకట్టు, 4 మధ్యతరహా నీటిపారుదల వనరుల ద్వారా 59,955 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ అయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందడం లేదు. రూ.18 కోట్ల జైకా నిధులతో చేపడుతున్న బుగ్గవంక ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు ఏళ్లతరబడి నత్తనడకన సాగుతూనే ఉన్నాయి. పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలపైనా, కేసీకెనాల్, పులివెందుల బ్రాంచ్‌కెనాల్, తెలుగుగంగకు నీటి కేటాయింపులపైనా చర్చసాగాల్సి ఉంది.

ఆకతాయిలనుంచి బైక్‌లు స్వాధీనం

- తల్లితండ్రులు సహా యువతకు సీఐ కౌన్సెలింగ్



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రాజారెడ్డి

బి.కొత్తకోట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కాలేజీల పరిసరాల్లో అడ్డదిడ్డంగా బైక్‌లు నడుపుతూ అమ్మాయిలను టీజింగ్ చేయడం, ట్రిబుల్‌రైడింగ్‌తో బైపాస్‌రోడ్డులో స్టంట్‌లు చేసే ఆకతాయి యువకులను పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారి బైక్‌లను సైతం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం యువకుల తల్లితండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వడం నేరమని, తమ పిల్లలు ఎక్కడికి వెళుతున్నారు, వాహనం ఎలా నడుపుతున్నారు, అని గమనించాల్సిన బాధ్యత తల్లితండ్రులపై వుండాలని సీఐ రాజారెడ్డి హితవు పలికారు. కాలేజీలు వదిలిన సమయంలో కొందరు యువకులు ఆ ప్రాంతంలో అభ్యంతరకరమైన పనులు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని, ఇకపై అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

కుటుంబ సమస్యలతో ఆత్మహత్యా యత్నం



చికిత్స పొందుతున్న శివయ్య

బి.కొత్తకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో టైలర్ శివయ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని పీటీఎం రోడ్డులో కాపురం వుంటున్న శివయ్య టైలర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి పొద్దు పోయాక మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగాడు. గమనించిన కుటుంబీకులు శివయ్యను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇక్కడి వైద్యుల సలహా మేరకు ప్రథమ చికిత్స అనంతరం మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవలు అందడంతో ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. బి.కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి పని వందశాతం గ్రౌండింగ్ కావాలి

- సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, పశువుల షెడ్లు, పనులు త్వరితగతిన చేపట్టాలి
- పల్లె పండుగ వారోత్సవాల్లో కలెక్టర్ చామకూరి శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ వారోత్సవాల్లో మంజూరైన ప్రతి పనిని యుద్ధ ప్రాతిపదికగా వందశాతం గ్రౌండింగ్ చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీఓలు, పీఆర్ ఇంజనీర్లు, ఉపాధి హామీ ఏపీఓలు, పంచాయతీ సెక్రటరీలు తదితరులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహించి గ్రామాలకు అవసరమైన రహదారులు, కాల్వలు, విద్యుత్, పశువుల షెడ్స్ తదితర మౌలిక వసతులు, ఉపాధి హామీ ద్వారా ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పనతో గ్రామాల్లో స్థిరమైన ఆస్తులు ఏర్పరచాలని సంకల్పించింది. తద్వారా గ్రామాలన్నీ నూతన శోభను సంతరించుకోనున్నాయి. ఈ పల్లె పండుగ వారోత్సవాల్లో జిల్లా మంత్రి పర్యులు, ప్రజాప్రతినిధులు పండుగలాగా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. వారోత్సవాల్లో భాగంగా 722 అంతర్గత సీసీ రోడ్లకు అనుమతులు మంజూరు చేశారన్నారు. ఆయా మండలాలకు మంజూరు చేసినవి, భూమి పూజ, పని మొదలైనవి, ప్రారంభం కానివి తదితర వివరాలు, కారణాలు ఆయా ఎంపీడీఓల ను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో వెంటనే పనులు మొదలు పెట్టాలని, డిసెంబరు 31లోగా అన్ని పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా ఇబ్బంది వల్ల మంజూరైన పనిని రద్దు చేయాల్సి వస్తే ఆ పని విలువకు తగిన విధంగా మరోచోట పనిని మొదలు పెట్టాలని సూచించారు. పనులు చేపట్టడానికి అవసరమైన ఇసుకను స్థానిక వాగులు, వంకలు ఎక్కడ లభ్యత ఉంటే అక్కడి నుంచి ప్రభుత్వ అనుమతించిన రీచుల నుంచి తీసుకెళ్లవచ్చన్నారు. లేబర్ బడ్జెట్ జనరేషన్‌లో కేవీపల్లి, మదనపల్లె, నిమ్మనపల్లె, వాయల్పాడు వెనుకబడి ఉన్నాయని, ఆయ మండలాల్లో ప్రగతిలోకి తీసుకురావలని సూచించారు.

బస్సు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు



కురబలకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు రైతులు తీవ్ర గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. తెట్టు పంచాయతీ పూజారివాండ్లపల్లెకు చెందిన వెంకటరమణ, దశరథ తన వాహనంలో అంగళ్ళుకు పొంతపనుల నిమిత్తం వచ్చారు. కాగా బి.కొత్తకోట నుంచి మదనపల్లెకు వెళ్ళుతున్న ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో వెంకటరమణ పరిస్థితి ఆందోళకరంగా ఉండడంతో తిరుపతికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి


పెద్దమండ్యం, అకోటబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో పక్కాగృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి సూచించారు. మంగళవారం పెద్దమండ్యం, ఎన్‌ఓ పల్లి, కలిచెర్లలో పక్కా గృహాల నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. వివిధ దశల్లో ఉన్న పక్కా గృహాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. దశల వారిగా మండలంలో జీఎస్ ఇంజనీరు అసిస్టెంట్‌లు పక్కా గృహాల నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. హౌసింగ్ ఏఈ అక్రమ్ గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

రామసముద్రం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అనాథ శవానికి గ్రామస్తులు అంత్యక్రియలు జరిపించి మానవత్వం చాటుకున్నారు. దినసరి మార్కెట్ షెల్టర్‌లో కొంతకాలంగా ఓ వృద్ధ అనాద ఉండేవాడు. ఇతనికి అక్కడి వ్యాపారులు రోజూ భోజనం పెట్టేవారు. కాగా సోమవారం రాత్రి ఆ వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందాడు. పంచాయతీ సెక్రటరీ నాయక్ గ్రామస్తులు కలిసి అంత్యక్రియలు జరిపించారు.

మొరవ పోతున్న బాలంవారిపల్లె ప్రాజెక్టు

- అప్రమత్తమైన పోలీసులు, రెవెన్యూ అధికారులు



పీలేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా సదుం, సోమల మండలాల్లో కురుస్తున్న వర్షాలకు గార్గేయ నదిలో ప్రవాహం పెరిగి నీరు బాలంవారిపల్లె ప్రాజెక్టులోకి అధిక మోతాదులో చేరుతోంది. సోమల మండలం పెద్ద ఉప్పరపల్లె ప్రాంతంలో రెండు చెరువులకు గండ్లు పడడడంతో నీటి ప్రవాహం పెరిగింది. ఆ నీరంతా ప్రాజెక్టులోకి చేరి నిండడంతో మంగళవారం సాయంత్రం మొరవ పోయింది. ఆ నీరంతా ప్రాజెక్టు దిగువన ఉన్న పింఛా నదిలో చేరడంతో పీలేరు మండలం బాలంవారిపల్లె వద్ద నది ప్రవాహం పెరిగింది. దీంతో పీలేరు మండల పోలీసు, అధికారులు అప్రమత్తమయ్యారు. నదీ పరీవాహక ప్రాంతాల్లోని మహిళలు, పశువుల కాపరులు నది వైపు వెళ్లవద్దని వారు హెచ్చరికలు జారీ చేశారు. బాలంవారిపల్లె ప్రాజెక్టుతోపాటు బాలంవారిపల్లె పంచాయతీ నూనేవాండ్లపల్లె వద్దనున్న బ్రిడ్జిని పీలేరు ఎస్ఐ బాలకృష్ణ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. రాత్రి పూట ఎవరూ నదిని దాటేందుకు ప్రయత్నించకూడదని పరిసర గ్రామాల్లో చాటింపు వేశారు.

మహిళపై దౌర్జన్యం కేసులో ఇద్దరికి జరిమానా

పీలేరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మహిళపై దౌర్జన్యం చేసిన ఇద్దరికి పీలేరులోని స్పెషల్ కోర్టు న్యాయాధికారి జరిమానా విధించినట్లు పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు కేవీపల్లె మండలం మద్దిపట్లవారిపల్లె పంచాయతీ అంగజాలవారిపల్లె వాసి వి.జయరామయ్య, చెన్నారెడ్డి కాలనీ వాసి ఇరగంరెడ్డి చెన్నారెడ్డి పద్మావతి నగర్ వాసి కొత్తపల్లె రత్నమ్మపై దౌర్జన్యం చేశాడు. ఆమె ఇంట్లోని రూ.40 వేలు విలువైన గృహోపకరణాలు ధ్వంసం చేశాడు. రత్నమ్మ ఫిర్యాదుతో అప్పటి ఎస్ఐ విశ్వనాథరెడ్డి కేసు నమోదు చేశారన్నారు. కేసు పీలేరులోని స్పెషల్ కోర్టులో విచారణ జరిగిందని, వారిపై నేరారోపణ రుజువు కావడంతో న్యాయాధికారి మురళీ వారిద్దరికీ చెరో రూ.6 వేలు జరిమానా విధించారన్నారు. లేని పక్షంలో ఒక్కొక్కరికి మూడు నెలల జైలుశిక్ష విధించారని సీఐ వివరించారు.

సప్లై చానెల్‌కు మరమ్మతులు

పీలేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ఆదేశాలతో కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సప్లై చానెల్‌కు అధికారులు మరమ్మతులు చేపట్టారు. సదుం, సోమల మండలాల్లో అధికంగా వర్షాలు కురుస్తుండడంతో మండలాల్లోని చెరువులు తెగడం, ఆ నీరంతా గార్గేయ నది ద్వారా బాలంవారిపల్లె ప్రాజెక్టులో చేరుతుండడంతో ఎమ్మెల్యే అప్రమత్తమయ్యారు. బాలంవారిపల్లె ప్రాజెక్టు నిండి మొరవపోతే ఆ నీరు పింఛానది ద్వారా కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్‌కు మళ్లించుకోవచ్చు. పింఛా నుంచి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు దారితీసే సప్లై చానెల్‌లో పొదలు, చెట్లు బాగా పెరగడంతో వాటిని తొలగిస్తూ చానెల్‌కు మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే ఈఓ గురుమోహన్ ఆదేశించారు.

మీడియా అవార్డు-2024కు ఎంట్రీలు ఆహ్వానం

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు వినియోగ ఆవశ్యకతపై ఓటర్లలో చైతన్యం, అవగాహన ప్రచారంలో ఉత్తమ కృషి చేసిన మీడియాకు అవార్డులను ప్రధానం చేసేందుకు వివిధ మీడియా సంస్థల నుంచి ఎంట్రీలను ఆహ్వానిస్తోందని, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ పేర్కొన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా (టెలి విజన్, రేడియో), ఆన్‌లైన్ (ఇంటర్నెట్, సోషల్) రంగాల్లో ఓటర్లలో చైతన్యం, అవగాహన పెంపొందించేందుకు కృషి చేసిన వారికి రంగానికి ఒక అవార్డు వంతు భారత ఎన్నికల సంఘం 2021 నుంచి ఏటా అవార్డులు అందిస్తోందన్నారు. 2024 ఏడాదికి సంబంధించి 2025 జనవరి 25వ తేదీ జాతీయ ఓటరు దినోత్సవం రోజున ఈ అవార్డులను ప్రధానం చేయనుందన్నారు. అవార్డు కింద ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందించనున్నారని సీఈఓ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి

మదనపల్లె టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు మెళకువలను పాటించాలని వ్యవసాయ ఏడీఏ శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం పోతబోలులో పొలం పిలుస్తోంది లో భాగంగా రైతులకు పలు పంటల సాగులో మెలకువలను వివరించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు పంటల సాగులో ఎక్కువగా ఎరువులను వాడడం వలన భూమి రొట్టలు పడుతుందన్నారు. ఏఓ నాగప్రసాద్,ఉద్యాన శాఖ అధికారి ఈశ్వరప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కే అసిస్టెంట్ నవ్యజ్యోత్స్న, వెంక టేశ్, వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

అతి కష్టంగా ఆరు కిలోమీటర్లు



బెంగళూరు బస్టాండ్‌లో నడిరోడ్డుపై గుంతలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు22: (ఆంధ్రజ్యోతి) మదనపల్లె పట్టణం నడుబొడ్డు నుంచి నాలుగువైపులా ఆ ఆరు కిలోమీటర్లు ప్రయాణం అతికష్టమౌతోంది. పట్టణం నుంచి పుంగనూరు రోడ్డు జాతీయ రహదారి వరకు, పట్టణం నుంచి వేంపల్లె క్రాస్ రోడ్డు వరకు. సీటీఎం రోడ్డు నుంచి తట్టివారిపల్లె బైపాస్ వరకు. చిత్తూరు బస్టాండ్ నుంచి పెంచుపాడు రోడ్డు లాభాల గంగమ్మ ఆలయం వరకు ఉన్న తారు రోడ్లు పాడైపోయాయి. రోడ్డుపై కొన్ని చోట్ల చెరువులను తలపించేలా గుంతలు పడ్డాయి. దీంతో బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాల్లో ప్రయాణం చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు వళ్లు హూనం చేసుకుని ప్రయాణిస్తున్నారు. ఇటీవల ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో రోడ్లు మరింత అధ్వానంగా మరిపోయాయి. బెంగళూరు బస్టాండ్ ఇంది రమ్మ కూడలిలో పెద్ద గుంతలు ఏర్పడి వర్షపు నీరుకూడా అక్కడే నిల్వ ఉండి చెరువులను తలపిస్తున్నాయి. బెంగళూరు రోడ్డులోని దర్గా వద్ద, పప్పిరెడ్డిగారిపల్లె వద్ద, చిప్పిలి మిల్క్‌డైరీ వద్ద, చిప్పిలిలో, వేంపల్లె క్రాస్ వరకు రోడ్డు మొత్తం గుంతలే కనిపిస్తాయి. చిత్తూరు బస్టాండ్ నుంచి బాకావానితోపులో రోడ్డు పూర్తిగా గుంతలమైయమైంది. చిత్తూరు బస్టాండ్ నుంచి పుంగనూరు రోడ్డులో మిషన్ కాంపౌండ్ ముందర, ఎంఎల్ఎల్ ఆస్పత్రి వద్ద, నిమ్మనపల్లె క్రాస్, నెమలి కల్యాణమండపం, బోర్డు, ఆంజనేయస్వామి ఆలయం వద్ద రోడ్డు పాడైపోయింది. ఈ మార్గాల్లో ప్రయాణం చేయాలనంటే నరకయాతన తప్పదు మరి.

బడి భోజనం.. ప్రక్షాళన



- పథకంలో మార్పులపై విద్యాశాఖ కసరత్తు
- విద్యార్థులందరూ భోజనం చేసేలా ప్రణాళిక
- ఎస్‌ఎంసీ సూచనలు పరిగణనలోకి...

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం పాఠశాలల్లో విద్యార్థులు కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో తింటున్నారు. మరికొందరు వదిలేస్తున్నారు. ఇంకొందరైతే అసలు బడి భోజనం తినకుండా ఇళ్ల నుంచే తెచ్చుకుంటున్నారు. రుచితో పాటు ఇష్టపడని కూరల కారణంగానే విద్యార్థులు బడి భోజనంపై అయిష్టత చూపుతున్నట్లు ఎప్పటి నుంచో ఉంది. అయితే దీనిపై అటు అధికారులు, ఇటు ప్రభుత్వం పట్టించుకోకుండా మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేస్తూ వస్తున్నారు. బడిలోని పిల్లలందరూ ఇష్టంగా బడిలోనే భోజనం చేసేలా కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకం ప్రక్షాళనకు కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసే డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో భారీ మార్పులు చేసేలా విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడి నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా భారీ మార్పులకు సిద్ధమైంది. గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్థమైన మధ్యాహ్న భోజన పథకాన్ని గాడిలో పెట్టేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది.

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 1748 , ఉన్నత, హైస్కూలు ప్లస్ పాఠశాలలు 306 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 1వ తరగతి నుంచి పదో తరగతి, ఇంటర్ వరకు 1.47 లక్షలు మంది విద్యార్థులు ఉన్నారు. అయితే ఇందులో దాదాపు 20 నుంచి 35 శాతం వరకు విద్యార్థులు వివిధ కారణాలతో మధ్యాహ్న భోజనం చేయడం లేదు. ఆయా కారణాల గురించి విద్యాశాఖ నివేదిక రూపంలో గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. అయినా ఫలితం లేదు. ఈ నేపధ్యంలో కూటమి ప్రభుత్వం తాజాగా ఇటీవల సమీక్ష నిర్వహించింది. పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్యకు - భోజనం తీసుకునే విద్యార్థుల సంఖ్యకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇటీవల స్కూలు మేనేజ్‌మెంటు కమిటీ (ఎస్‌ఎంసీ) నుంచి బడి భోజనం బాగుండేందుకు ప్రభుత్వం సూచనలు కోరింది. పలు కమిటీలు వివిధ సూచనలు చేయగా అందులో మేలైన సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని మధ్యాహ్న భోజనం పథకంలో మార్పులు చేసేందుకు సిద్ధమైంది.

కమిటీ సూచనలు ఇలా...

- మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్ పెంచాలి
- పోర్టిఫైడ్ బియ్యం పేరుతో సరఫరా చేస్తున్న లావు బియ్యం స్థానంలో సన్న బియ్యం ఇవ్వాలి.
- రోజువారి మెనూలో అందించే చింతపండు పులిహోర బదులు లెమన్ రైస్ ఇస్తే విద్యార్థులు ఇష్టంగా తినే అవకాశం ఉంది. పొంగలి కూడా చాలా మంది విద్యార్థులు తినడం లేదు. దీనిలో కూడా మార్పులు చేయాలి.
- ఉదయం ఇచ్చే రాగిజావలో నాణ్యత ఉండడం లేదు. దానికి ప్రత్యామ్నాయంగా రాగితో చేసిన చిక్కీలు, లడ్డూలు, లేదా పాలు ఇవ్వాలి.
- కడప కార్పొరేషన్ పరిధిలో ఇస్కాన్ సంస్థ మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తుంది. ఈ సరఫరాలో భోజనంలో కోడిగుడ్డు ఇవ్వడంలేదు. దీనికి ప్రత్యామ్నాయంగా అరటిపండు ఇస్తున్నారు. దీనిపై కూడా ఇంకా మెరుగైనది ఇస్తే బాగుంటుంది.
- ఏజన్సీలకు ఏ నెలకు ఆ నెల బిల్లులు చెల్లించడం లేదు. అప్పు లు చేయాల్సి వస్తోంది. నెలనెలా బిల్లులు ఇస్తే ఏజన్సీలకు అప్పులబాధ తప్పుతుంది.

అయితే... నాకేంటి?

- విద్యుత్ శాఖలో ఓ ఉద్యోగి లంచావతారం
- పనుల కోసం వెళ్లే ప్రజలకు తప్పని పాట్లు
- సమస్యలు పరిష్కారం కాక రైతన్నలూ సతమతం

విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి అవినీతి దాహం తారాస్థాయికి చేరింది. విద్యుత్ సంబంధిత పనులు, సమస్యలపై ఎవరైనా ఆయనను ఆశ్రయిస్తే.. 'అయితే నాకేంటి' అంటూ రాజేంద్రప్రసాద్ అహనా పెళ్లంట సినిమాలో సిగ్గులేకుండా లంచం డిమాండ్ చేసినట్లు చేస్తున్నాడు. చేయి తడపందే పని జరుగదని నిర్మొహమాటంగా చెబుతున్నాడు. దీంతో రైతులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దువ్వూరు విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఈ ఉద్యోగి నిర్వాకంపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.





తెగిపోయి పొలాల్లో పడిన విద్యుత్తు వైరు

దువ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి గృహ అవసరాలకు, వ్యవసాయ మోటార్లకు సంబంధించిన విద్యుత్తు పనుల కోసం వెళ్లే ప్రజలను ఆమ్యామ్యాలు సమర్పించాల్సిందేనని కరాఖండిగా చెబుతున్నాడు. దీంతోవిసిగి వేసారిన ప్రజలు తిరుపతిలోని విద్యుత్తుశాఖ టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. అయితే ఆ శాఖకు సంబంధించిన యూనియన్‌ను అడ్డం పెట్టుకుని సదరు ఉద్యోగి సమస్యల నుంచి సులువుగా గట్టెక్కుతున్నాడు. మండల విద్యుత్తు శాఖలోని సిబ్బందిలో నెలకొన్న అంతర్గత కలహాలు ప్రజలకు శాపంగా మారాయి. ఇటీవల దువ్వూరు పొలాల్లోని కుమ్మరోనిమల్లు, గాజులోళ్లబావి సమీపంలో విద్యుత్తు వైర్లు తెగి కిందపడ్డాయి. ఈ సమస్యను రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన సమాధానం లేకపోవడంతో వీరు ఆందోళనకు గురవుతున్నారు. వైర్లు తెగిపోవడంతో దువ్వూరు పొలాల్లోని 20 దాకా వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయి అయిదు రోజులుదాకా గడిచింది. దీంతో బోర్ల కింద పొలాల్లో వేసిన జొన్న, వరి, అనప, వేరుశనగ, అరటి, పసుపు లాంటి పంటలు నీటి తడులు అందక సంబంధిత రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాగే కాలయాపన చేస్తే పంటలు ఎండిపోతాయని సంబంధిత రైతులు అధికారులపై ఆక్రోశం వెలుబుచ్చుతున్నారు. పంటల సాగుకు లక్షలాది రూపాయలు పెట్టుబడులు కింద వెచ్చించామని ఆందోళన చెందుతున్నారు. సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫిర్యాదులు వాస్తవమే..

తమ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగిపై ఫిర్యాదులు వచ్చిన మాట వాస్తవమే. పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. శాఖాపరంగా పై అధికారుల నిర్ణయాల మేరకు నడుచుకుంటాం.

-బి.వీరారెడ్డి,
విద్యుత్తు శాఖఏఈ, దువ్వూరు

చెరువులో పడి వ్యక్తి మృతి



నిరసింహుడు (ఫైల్‌ఫొటో)

దువ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాపురం సమీపంలోని చెరువులో ప్రమాదవశాత్తు పడి వనిపెంట నరసింహుడు (35) అనే వ్యక్తి మృతి చెందాడు. సోమవారం సాయంత్రం నుంచి ఇతను కనిపించకపోవడంతో కుటుంబీకులు వెతకడం ప్రారంభించారు. చెరువు వద్ద చెప్పులు, ఇతర వస్తువులు కనిపించడంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం చెరువులో ఇతని శవాన్ని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భార్యపై భర్త కత్తితో దాడి



పోరుమామిళ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రంగ సముద్రం పంచాయతీ పరిధిలోని మహబూబ్‌నగర్‌కాలనీలో వనపర్తి అంజలి అనే మహిళపై ఆమె భర్త నారాయణ కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్‌ఐ మూర్తి వివరాల మేరకు.. వనపర్తి నారాయణకు అంజలితో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. నారాయణ మద్యానికి బానిసై... అనుమానం పెంచుకున్నాడు. సోమవారం రాత్రి మద్యం మత్తులో భార్యపై మచ్చుకత్తితో దాడి చేయడంతో తలకు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. బంధువులు చికిత్స నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

9 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడ్డ తమిళ కూలీలు, దుంగలతో ఫారెస్టు అధికారులు

సుండుపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న ఇద్దరు తమిళ కూలీలను అరెస్టు చేసినట్లు సానిపాయి ఫారెస్ట్ రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ముడుంపాడు బీటు మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి అక్ర మంగా 9 ఎర్రచందనం దుంగలను తరలిస్తుండగా బేస్ క్యాంపు సిబ్బంది దాడులు నిర్వహించి తమిళనాడుకు చెందిన ఇద్దరు కూలీలను అదుపులోకి తీసుకున్నారు. అడవుల రక్షణ మనందరి బాధ్యత అని.. కొత్త వ్యక్తులు ఎవరైనా అటవీ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌వో రమేశ్‌బాబు, ముడుంపాడు బీట్ ఎస్పీవో అంజనాస్వాతి, గౌసియా, రమణ, శంకర్, రామ య్య, శేషు, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడి ఆచూకీ తెలపండి



కంచపు లోకేశ్ (ఫైల్‌ఫొటో)

సంబేపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవికమ్మపల్లికు చెందిన కంచపు లోకేశ్ (14) అనే బాలుడు అదృశ్యమయ్యాడని.. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు తెలియజేయాలని ఎస్‌ఐ భక్తవత్సలం తెలిపారు. అడవికమ్మపల్లి స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న లోకేశ్ ఈనెల 21వ తేదీ స్కూల్‌లో ఐడీ కార్డు తీసుకోవాలని తన తండ్రి వద్ద రూ.500 డబ్బులు తీసుకొని వెళ్లినట్లు తెలియజేశారు. ఇంటికి తిరిగి రాకపోవడంతో బాలుడు తండ్రి రామయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఈ మేరకు సబేపల్లె పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాలుడు గురించి ఎవరికైనా ఆచూకీ తెలిస్తే.. 9121100566, 7981200671 సెల్ నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

మున్సిపాలిటీకి శాపంగా... వైసీపీ అసమర్థ పాలన

- సుందరీకరణ పేరుతో వందల కోట్లు వృథా
- పాలకమండలి నిర్లక్ష్యంతో 27 కోట్ల విద్యుత్ బకాయిలు
- చేసిన పనులను మళ్లీ చేసిన గత ప్రభుత్వం
- విద్యుద్దీపాల సమస్య పరిష్కరించకుంటే ధర్నా
- పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ అసమర్థపాలనతో పులివెందుల మున్సిపాలిటీకి శాపంగా మారిందని, సుందరీకరణ పేరుతో వందలకోట్ల రూపాయలు వెచ్చించినా ఫలితం లభించలేదని పాలకమండలి నిర్లక్ష్యంతో 27 కోట్ల విద్యుత్ బకాయిలు పెట్టారని పశ్చిమ రాయలసీమ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎన్‌డీఏ కూటమి నాయకులు బీజేపీ అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డిలతో కలిసి మున్సిపల్ కార్యాలయానికి తరలివెళ్లి మున్సిపల్ సమస్యలపై కమిషనర్, అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మున్సిపాలిటీల్లో విద్యుత్ దీపాలను ఆర్పి వేసి పట్టణాన్ని అంధకారంలోకి నెట్టడానికి కారణాలను అడిగారు. వారంలోగా విద్యుత్ దీపాల సమస్య పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం మీడియా సమావేశంలో రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో దాదాపు 4800 విద్యుత్ దీపాలు ఉంటే.. పదిశాతం కూడా ప్రస్తుతం వెలగడం లేదన్నారు. విద్యుత్ దీపాలు వెలగకపోవడం వల్ల పులివెందులలో దొంగతనాలు ఎక్కువయ్యాయన్నారు. పాలకమండలి చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వాస్తవాలు దాచిపెట్టి విద్యుత్‌దీపాలను వెలగనీయకుండా చేయడం, రెండు మూడు రోజులకు ఒకసారి మంచినీటిని విడుదల చేస్తున్నారన్నారు. ఇక 2004 నుంచి 2009 వరకు, 2019 నుంచి 2024 వరకు దఫదఫాలుగా చేసిన రింగు రోడ్డు సుందరీకరణ పనులను మళ్లీ మళ్లీ చేసుకుంటూ నిధులు వృథా చేశారన్నారు. ఇప్పటికి మున్సిపల్ పరిధిలో 150 వీధుల్లో అండర్ డ్రైనేజీ, సిమెంటు రోడ్లు వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నో ఆశలతో అధికారం ఇస్తే సొంత నియోజకవర్గానికి జగన్ తీవ్ర అన్యాయం చేశారన్నారు. పులివెందుల ప్రజలకు ఏ వార్డుకు ఎవరు కౌన్సిలరో కూడా తెలియని పరిస్థితి ఉండడం చూస్తే గత ప్రభుత్వ పాలన ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. వారంలోగా మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్‌దీపాల సమస్యను పరిష్కరించకపోతే ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గండికోట నుంచి 3150 క్యూసెక్కులు విడుదల



కొండాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి మంగళవారం 3150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ఉమా మహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 3000 క్యూసెక్కులు, వరద నీరు మరో 150 క్యూసెక్కులు వచ్చి చేరినట్లు డీఈ తెలిపారు. ప్రాజెక్టులోకి వచ్చే నీటిని యధా తథంగా మైలవరం జలాశయానికి వదులుతున్నట్లు తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.2 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా

కడప క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణాపై గట్టి నిఘా పెట్టి... అటవీ సంపదను పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం జిల్లా అటవీ కార్యాలయంలో ఉప అటవీ అధికారులు, క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఫారెస్టు ప్రొటెక్షన్ పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

కోతి కరిచి మహిళకు గాయాలు

చెన్నూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమాచుపల్లెలో మంగళవారం ఉదయం ఇంటి వద్ద ఉన్న వెంకటసుబ్బమ్మ అనే మహిళను కోతి కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం బంధువులు వైద్యశాలకు తరలించారు. ఇటీవల మూడేళ్ల బాలికను కోతి కరిచిందని.. గ్రామంలో కోతుల బెడద ఎక్కువైందని.. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రసవత్తరంగా... ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీలు

- స్వల్ప స్కోర్‌కే కుప్ప కూలిన వెస్ట్ గోదావరి
- 316 పరుగుల భారీ స్కోర్ దిశగా కడప
- 162 పరుగులకే చేతులెత్తేసిన కర్నూలు



77 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్న శివప్రశాంత్



73 పరుగులు చేసిన ఫైజాన్ (కడప)



5 వికెట్లు తీసిన రేవంత్ (ఈస్ట్ గోదావరి)

కడప స్పోర్ట్స్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): కడపలో ఏసీఏ అండర్-14 మెన్స్ రెండు రోజుల మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా మంగళవారం వివిధ జట్ల మధ్య పోటీలు రసవత్తరంగా సాగాయి. ఇందులో భాగంగా కేఓఆర్ఎం మైదానంలో విశాఖపట్నం-వెస్ట్ గోదావరి జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన వెస్ట్ గోదావరి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 74.3 ఓవర్లలో కేవలం 112 పరుగుల స్వల్ప స్కోర్‌కే ఆలౌట్ అయ్యింది.

తదుపరి బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు ఆట ముగిసే సమయానికి 22.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 82 పరుగులు చేసింది. ఇందులో తమన్‌రెడ్డి 43 పరుగులతో, అక్షిత్‌రెడ్డి 35 పరుగులతో క్రీజ్‌లో వున్నారు.

ఏసీఏ క్రికెట్ స్టేడియంలో

నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-చిత్తూరు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్‌కు దిగి మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లకు 8 వికెట్లు కోల్పోయి 316 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో లోకేష్ 53, ఫైజాన్ 73 పరుగులు చేసి ఔట్ కాగా శివ ప్రశాంత్ 77 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు.

కేఎస్ఆర్ఎం మైదానంలో

కర్నూలు-ఈస్ట్ గోదావరి జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కర్నూలు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. మొదటి ఇన్నింగ్స్‌లో 78.5 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి 162 పరుగులకే చేతులెత్తేసింది. ఇందులో రుత్విక్ కళ్యాణ్ 72 పరుగులు చేశారు. ఇక బౌలింగ్ విభాగంలో ఈస్ట్‌గోదావరి జట్టు బౌలర్ రేవంత్ 5 వికెట్లు పడగొట్టి గట్టి దెబ్బతీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు ఆట ముగిసే సమయానికి 17 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసింది. ఇందులో కార్తీక్ 28 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. ఇంకా 98 పరుగుల వెనుకంజలో ఈస్ట్ గోదావరి జట్టు ఎదురీదుతోంది.

ఆర్టీసీకి దసరా ఆదాయం రూ.కోటి

కడప మారుతీనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా ఈనెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకూ వివిధ ప్రాంతాలకు రాను, పోను సుమారు 390 ప్రత్యేక బస్సులను సమకూర్చామని వీటి ద్వారా రూ.కోటి ఆదాయం సమకూరిందని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు విజయవాడకు రాను పోను 53 బస్సులు, బెంగళూరుకు 128, హైదరాబాదుకు 99, చెన్నైకి 22, తిరుపతికి 51, కర్నూలుకు 8, ఇతర ప్రాంతాలకు మరో 29 బస్సులు తిప్పామన్నారు. మొత్తంగా 390 బస్సులు నడిపామని వీటిద్వారా రూ.1,02,84,721 ఆదాయం వచ్చిందని అన్నారు. ఇందులో అత్యధికంగా హైదరాబాద్‌కు తిప్పడం ద్వారా రూ.30,71,411 ఆదాయం రాగా.. బెంగళూరుకు తిప్పడం ద్వారా రూ.30,48,665 వచ్చిందన్నారు.

మద్యం మత్తులో దారుణ హత్య



గోపవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గోపవరం మండలం శ్రీనివాసపురంలో మంగళవారం రాత్రి దారుణం జరిగింది. మద్యానికి బానిసై తరచూ తల్లితో గొడవపడుతున్న భాస్కర్‌రెడ్డి ఎప్పటిలాగే మంగళవారం రాత్రి తాగి ఇంటికి వెళ్లగా తల్లితో వాగ్వాదానికి దిగాడు. ఎంతసేపటికీ వినకపోగా తల్లి అక్కడి సమీపాన ఉన్న మరిది సుబ్బారెడ్డి ఇంటికి వెళ్లింది. భాస్కర్‌రెడ్డి అదే కోపంతో సుబ్బారెడ్డి ఇంటికి వెళ్లి తన తల్లిని ఇంటికి పంపించాలని ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ నేపధ్యంలో దగ్గరలో ఉన్న కత్తెర తీసుకుని సుబ్బారెడ్డి(48) గుండెలో పొడిచి పారిపోయాడు. వెంటనే సుబ్బారెడ్డిని బద్వేలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్తం

రేపు సంస్మరణ సభ

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు, ఏపీ మహిళా సమాఖ్య జాతీయ సమితి సభ్యురాలు బషీరున్నీసా సంస్మరణ సభ ఈనెల 24న ప్రెస్‌క్లబ్‌లో జరుగుతుందని, జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కర్యాదర్శి దుర్గాభవాని హాజరవుతారని తెలిపారు.

'మహిళలకు రక్షణ కరువు'

కమలాపురం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి అన్నారు. మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం మహిళలపై దాడులు జరుగుతున్నాయని, మహిళలకు రక్షణ కరువైందని అన్నారు.

నాణ్యమైన సరుకులు అందించాలి

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాగసుబ్బారెడ్డి మాట్లాడారు. బియ్యం, పప్పు, దినుసులు, కోడిగుడ్లు నాణ్యత కొరవడినట్లు తెలుస్తోందన్నారు. దీంతో అంగన్వాడీ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోందని, ఇప్పటికైనా నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

పొలం పిలుస్తోంది

కమలాపురం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కమలాపురం మండలంలోని సంబటూరు గ్రామంలో మండల వ్యవసాయధికారి సరస్వతి మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు మినుము, వేరుశనగ, వరి పంటల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించినట్లు తెలిపారు. అధిక వర్షాలకు రైతులు వివిధ పంటల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది జెడ్‌బీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చెట్టుకొమ్మ విరిగిపడి గాయాలు

చెన్నూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండపేటకు చెందిన బోగాల కొండారెడ్డి అనే వ్యక్తిపై మంగళవారం సాయంత్రం చెట్టుకొమ్మ విరిగిపడడంతో గాయాలయ్యాయి. కొండారెడ్డి మధ్యాహ్నం గ్రామంలోని ఫారెస్టు బంగ్లాపక్కన ఉన్న అరుగుపై పడుకుని ఉండగా ఉన్నట్లుండి చెట్టు కొమ్మ విరిగి అతనిపై పడింది. స్థానికులు చికిత్స నిమిత్తం 108లో రిమ్స్‌కు తరలించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

చెన్నూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : బుడ్డాయపల్లెలో విద్యుత్ సమస్యను ప్రజలు విద్యుత్‌శాఖ సిబ్బందికి చాలా కాలంగా తెలిపినా పరిష్కారం కాలేదు. అయితే ఇటీవల చెన్నూరుకు వచ్చిన ఎమ్మెల్యేకు టీడీపీ జిల్లా తెలుగు యువత కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి విషయం తెలిపారు. ఆయన అధికారులకు తెలపడంతో 63 కేవీ ట్రాన్స్‌ఫార్మరు స్థానంలో మంగళవారం 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.

సంఘటితంగా ఉద్యమించాలి

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలపై ఆటో కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఏపీ ఆటోడ్రైవర్స్ అండ్ ఫెడరేషన్ ఏఐటీయూసీ అనుబంధ కడప నగర సమితి ఆధ్వర్యంలో కడప నగరంలోని పాత రిమ్స్ ఆటో స్టాండు కార్మికులకు ఐడెంటిటీ కార్డులు పంపిణీ చేశారు. నగర అధ్యక్ష, కార్యదర్శులు పుల్లయ్య, ఆవుల నారాయణ, నాయకులు అంకుశం, పాత రిమ్స్ ఆటో స్టాండు నాయకులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి

వేంపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆధార్‌లో మార్పుచేర్పులకు వేంపల్లెలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటుచేయాలని ఎంపీడీఓ కుళాయమ్మకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. వేంపల్లెలో ఉన్న ఆధార్ కేంద్రాలు పనిచేయడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దొంతు సుమన్, ఈశ్వర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో నీటి కష్టాలు



పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో వృథాగా ఉన్న బోరు, సంపు (ఇన్‌సెట్) నీరు లేక మూతపడ్డ మరుగుదొడ్లు

పులివెందుల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిలో నీటి కష్టాలు ఎదుర్కోవాల్సి దుస్థితి నెలకొంది. దాదాపు 350కి పైగా మంచాల సామర్థ్యం ఉన్న ఆసుపత్రిలో నీటి సమస్యతో రోగులు, డాక్టర్లు, సిబ్బంది లబోదిబోమంటున్నారు.ఔట్ పేషంట్ (ఓపీ), ఎమెర్జెన్సీ, ఇన్‌పేషంట్ (ఐపీ) ఇలా మూడు పెద్ద భవనాలు నిర్మించినప్పటికి నీటి సమస్యను తీర్చడంలో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ విఫలమయ్యారని చెప్పవచ్చు. భవనాల నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్ బోరు, ఓ సంపు నిర్మించారు. మూడు అంతస్థులు కలిగిన మూడు పెద్ద భవన నిర్మాణాలకు ఆ బోరునీటినే వాడుకున్నారు. నిర్మాణాలు పూర్తైన తర్వాత అక్కడే ఉన్న చిన్న సంపులో నింపి వారంలో రెండుసార్లు ఆసుపత్రికి సరఫరా అందిస్తున్నారు. దీంతో వారంలో రెండుసార్లు మాత్రమే మరుగుదొడ్లను ఉపయోగించాల్సిన పరిస్థితి నెలకొందని అంటున్నారు. ఎమెర్జెన్సీ వార్డులో రోగుల అవస్థలు వర్ణణాతీతమని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఆసుపత్రి కోసం మరో బోరు ఏర్పాటుచేసి, సంపు నిర్మించారు. బోరులో నీరు ఉన్నప్పటికి వినియోగంలోకి రాలేదని చెబుతున్నారు. కాగా బిల్లులు రావడం లేదనే సాకుతో ఆ కాంట్రాక్టర్ బోరును అప్పగించలేదని వైద్యాధికారులు చెబుతున్నారు. కనీసం రోగుల కోసం అయిన బోరును అప్పగించాలని చెబుతున్న కనికరం చూపలేదని డాక్టర్లు వాపోతున్నారు. అప్పుడప్పుడు ట్యాంకర్లతో కూడా నీటిని సరఫరా చేసినట్లు అక్కడి సిబ్బంది చెబుతున్నారు. వైద్యం, మందులు, ఆపరేషన్లతో పాటు మంచాలు, ఫ్యాన్లు, కుర్చీలు, స్త్రీలు, పురుషలకు మరుగుదొడ్లు లాంటి సౌకర్యాలు ఉన్నప్పటికి నీటి సమస్య ఎదురవుతోందని రోగులు వాపోతున్నారు. జిల్లా ఉన్నతస్థాయి అధికారులు చర్యలు తీసుకొని నీటి కష్టాలు లేకుండా చూడాలన్నారు.

కాంట్రాక్టర్‌ను ఎన్నోమార్లు కోరాం

ప్రస్తుతం ఉన్న బోరు ద్వారా వచ్చే నీరు సరిపోవడం లేదు. బోరు, సంపును తమకు అప్పగించాలని కాంట్రాక్టర్‌ను కోరాం. మూడు నెలలుగా అదో ఇదో అంటున్నారే తప్ప అప్పగించలేదు. దసరా పండుగకు అప్పగిస్తానని చెప్పారు. ఇప్పటికి అప్పగించలేదు. మరోమారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నీటి కష్టాలు లేకుండా చేస్తాం.

- మల్లీశ్వరి, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి, పులివెందుల

నీరు పోయే దారేదీ..?



నీటి కుంటను తలపిస్తున్న ఈ ప్రాంతం కమలాపురం పోలీసు లైను కాలనీకి వెళ్లే రహదారి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఇలా నీరు చేరింది. వాన నీరంతా ఎటూ పోలేక ఇలా నిల్వ చేరింది. ఇలాగే చాలా ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక వర్షం నీరు రోడ్లపై నిలిచి ఉంది. అధికారులు నిద్రమత్తు వీడి మురుగు కాల్వల్లో పూడిక తీసి వర్షం నీరు నిల్వచేరకుండా తగు చర్యలు చేపట్టి ప్రజల కష్టాలు తీర్చాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

- కమలాపురం రూరల్, (ఆంధ్రజ్యోతి)

ఉక్కు ఫ్యాక్టరీ పట్ల దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్

కడప, మారుతీనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన ఉక్కుఫ్యాక్టరీపై పాలక ప్రభుత్వాలు దృష్టిసారించాలని రెవెల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌సీపీఐ)రాష్ట్ర కార్యదర్శి సతీష్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప జిల్లా అత్యంత కరువు ప్రాంతమన్నారు.హంద్రీనీవా, గాలేరు-నగరి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలన్నారు. అలాగే బ్రహ్మంసాగర్ కాలువ పనులు పూర్తిచేస్తే లక్షా అరవైరెండు వేల ఎకరాలకు సాగునీరు అందుతాయన్నారు. జిల్లా మహిళా నాయకురాలు సుగుణమ్మ, జిల్లా కార్యదర్శి శేఖర్, నాయకులు శ్రీనివాసులు, అరుణ్‌కుమార్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులకు టైం స్కేల్ ఇవ్వాలి



ఆర్జీయూకేటీ వీసీకి వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ

వేంపల్లె,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో 2018లో చేరిన కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీకి టైం స్కేల్ అమలుచేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుస్సేన్ ఆర్జీయూకేటీ వైస్‌చాన్సలర్ విజయ్‌కుమార్‌కు విజ్ఞప్తిచేశారు. మంగళవారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీని సందర్శించిన వీసీ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఆర్డర్‌ను ఇవ్వాలన్నారు. సమాన పనిక సమాన వేతనం ఇవ్వాలని వీసీని కోరారు. గత ప్రభుత్వంలో పనిచేసిన చాన్సలర్ కేసీరెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేశారని, కోర్టు ఉత్తర్వులను గౌరవించి కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీకి న్యాయం చేయాలని విన్నవించారు.

భూ-రీసర్వే గ్రామ సభలో ఫిర్యాదుల వెల్లువ

సింహాద్రిపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవతాపురంలో మంగళవారం జరిగిన భూ-రీసర్వే గ్రామ సభలో గ్రామస్థుల నుంచి కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు అందాయి. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వహించిన భూ-రీసర్వేలో భారీగా అవకతవకలు చోటు చేసుకున్నాయి. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు మండలంలో రీసర్వే చేసిన గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి భూ సమస్యలు తీర్చేందుకు రెవెన్యూ అధికారులు చేస్తున్న కృషికి గ్రామస్తులు(బాధితులు) హర్షం వ్యక్తం చేస్తున్నారు డిప్యూటీ తహసీల్దార్ హరి బాబు, వీఆర్వోలు రాజకుల్లాయిరెడ్డి, రాజగోపాల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

వల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గతంలో జరిగిన రీసర్వేలో వచ్చిన భూ సమస్యలన్నీ ఎక్కువయ్యాయని, ప్రభుత్వం మరలా సర్వేలో వచ్చిన సమస్యలు పరిష్కర దిశ కోసమే ఈ రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని తహసీల్దారు శ్రీవాణి అన్నారు. మంగళవారం ఇసుకపల్లె రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఎక్కడికీ వెళ్లకుండా తమ గ్రామ రెవెన్యూ పరిధిలో భూసమస్యలు ఏవైనా ఉంటే ఆ సమస్యలను సంబంధించి సరైన ధృవపత్రాలతో ఈ రెవెన్యూ సదస్సులో అందిస్తే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి

కడప క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని కడప అగ్నిమాపకశాఖ అధికారి బస్విరెడ్డి సూచించారు. కడప నగరం ఏపీజీబీ ప్రధాన కార్యాలయం నందు అగ్నిమాపకసిబ్బంది ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యాలయంనందు అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు అక్కడ ఉన్న అగ్నిమాపక పరికరాలు ఏ విధంగావాడాలి, ఏ విధంగా ప్రతిస్పందించాలన్న విషయంపై మాక్‌డ్రిల్ చేయడం జరిగింది.కార్యక్రమంలో బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ ఫోకస్‌పై అవగాహన

పులివెందుల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ ఫోకస్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాఫోరీ మైండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కంపెనీ ప్రతినిధి అమిత్‌కుమార్ అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మూడు రోజుల పాటు ప్రాక్టికల్ సెషన్స్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న కడప నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కడప నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి అన్నారు. నగరంలోని సంజన్న సర్కిల్ నుంచి నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూలు డెరెక్టరు వివేకానందరెడ్డి వారిని ఘనంగా సత్కరించారు. ఇచ్చిన మాట ప్రకారం మూడు నెలల్లోపు ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అలాగే కడప నగరంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని, ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూలు డైరెక్టరు వివేకానందరెడ్డి, స్థానిక ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

- ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ మెస్‌లను తనిఖీ చేసిన వీసీ



ట్రిపుల్‌ఐటీ మెస్‌ను తనిఖీ చేస్తున్న ఆర్జీయూకేటీ వీసీ విజయ్‌కుమార్

వేంపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆర్జీయూకేటీ వైస్‌చాన్సలర్ విజయ్‌కుమార్ మెస్ నిర్వాహకులకు సూచించారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో మెస్‌లను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు తింటున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. మరింత నాణ్యతగా ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. పలు సూచనలిచ్చారు. సరైన ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ రవికుమార్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు: ఎస్ఐ



వాహనాల తనిఖీలో ఎస్ఐ షరీఫ్

సింహాద్రిపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవని సింహాద్రిపురం ఎస్ఐ మహమ్మద్ షరీఫ్ హెచ్చరించారు. మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. సాయంకాలం మండల పరిధిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. రికార్డులు సరిగాలేని వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులు తప్పనిసరిగా వారి వాహనానికి సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలని ఎస్ఐ ప్రజలకు సూచించారు.

వాటర్ గ్రిడ్ పనులను పరిశీలించిన నాబార్డ్ జీఎం

లింగాల, అక్టోబరు 22: పులివెందుల నియోజకవర్గ ప్రజలకు నిరంతరం తాగునీటి సరఫరాచేయాలనే ఉద్దశంతో చేపట్టిన వాటర్ గ్రిడ్ పనులను మంగళవారం నాబార్డ్ జనరల్ మేనేజర్ పహాడిసింగ్ మండలంలోని పార్నపల్లెకు వచ్చి పరిశీలించారు. రూ.374కోట్లతో వాటర్ గ్రిడ్ పనులను చేపట్టామని ఇందులో రూ.233కోట్ల పనులు పూర్తిచేశామని, 2025 మార్చి నాటికి పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా ఎస్ఈ ఏడుకొండలు నాబార్డు జీఎంకు వివరించారు. ట్యాంకుపనులు, సబ్‌స్టేషన్ పనులను, పైప్‌లైన్‌పనులను జీఎం పహాడ్ సింగ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ విజయవిహారితో కలిసి పరిశీలించారు.

దేశభక్తికి నిలువెత్తు నిదర్శనం అష్ఫాఖుల్లాఖాన్

పులివెందుల టౌన్,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేశభక్తికి నిలువెత్తు నిదర్శనం స్వాతంత్ర్యం కోసం పోరాడిన ముద్దాడిన వీరుడు అష్ఫాకుల్లఖాన్ అని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండి సుధాకర్‌రెడ్డి కొనియాడారు. జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అష్ఫాకుల్లాఖాన్ జయంతి సభలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు.

దేశభక్తికి నిలువెత్తు నిదర్శనం అష్ఫాఖుల్లాఖాన్

కడప సెవెన్‌రోడ్స్ అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) :దేశభక్తికి నిలువెత్తు నిదర్శనం స్వాతంత్ర్యం కోసం పోరాడిన ముద్దాడిన వీరుడు అష్ఫాకుల్లఖాన్ అని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కొనియాడారు. స్థానిక ఐటీఐ కాలేజీలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం



చెక్కు అందజేస్తున్న ఏఎస్పీ ప్రకాష్‌బాబు

కడప(క్రైం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు అన్నారు. ప్రొద్దుటూరు టూటౌన్ ఎస్ఐ సుబ్బరాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన భార్య వెంకటలక్ష్మికి మంగళవారం కార్పస్ ఫండ్ నుంచి మంజూరు అయిన రూ.లక్ష చెక్‌ను ఆయన అందజేశారు. అనంతరం ఆమె కుటుంబసభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ఏఓ జ్యోతి పాల్గొన్నారు.

బీడీ, సిగార్ ఉత్పత్తులపై జీఎస్టీ రద్దు చేయాలి: సీఐటీయూ



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కడప నాగరాజుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బీడీ, సిగార్ ఉత్పత్తులపై జీఎస్టీ రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం కామ్రేడ్ అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బీడీ కార్మికుల స్థితిగతులపై చర్చించారు. ముఖ్యఅతిథులుగా జి.ఓబులు హాజరై మాట్లాడారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామనూరు శ్రీనివాసులరెడ్డి, మనోహర్, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

ప్రపంచ జ్ఞాన సంపాదనే మీ లక్ష్యం కావాలి: సీఐ



సదస్సులో మాట్లాడుతున్న సీఐ రోషన్

కమలాపురం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ విజ్ఞాన సంపాదనే మీ లక్ష్యంగా ముందుకెళ్లాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండలాని కమలాపురం సీఐ రోషన్ తెలిపారు. భారత ప్రభుత్వం క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం కడప శాఖ ఆదేశాల మేరకు మదర్‌థెరిసా సేవా సమిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై కమలాపురం డిగ్రీ కాలేజీలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిగా సీఐ రోషన్ హాజరై మాట్లాడారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు దూరం గా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హోమియోపతి డాక్టర్ షాకిర్‌హుసేన్, కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్, మదర్‌థెరిసా సేవా సమితి ట్రస్టు ఛైర్మన్ విజయ్‌కుమార్, పరీక్ష నియంత్రణ అధికారి డాక్టర్ క్రిష్ణ, ఎన్ఎస్ఎస్ ఆఫీసరు లక్ష్మయ్య, అయ్యవారు, అశోక్‌కుమార్, మాలకొండయ్య, జిల్లా డి అడిక్షన్ సెంటరు సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి



మురికి నీటిని పారబోస్తున్న దృశ్యం

లింగాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ, మలేరియా వ్యాధులు రాకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య అన్నారు. లింగాలలో మంగళవారం ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరం వస్తే వెంటనే రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, దోమతెరలు ఉయోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ శివరాం, సూపర్‌వైజర్లు అయేషాబేగం, కుసుమకుమారి పాల్గొన్నారు.

విజయదుర్గమ్మ సన్నిధిలో రాహుకేతు పూజలు



రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు (ఇన్‌సెట్) విజయదుర్గాదేవి

కడప కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కడప నగర బిల్టప్ సర్కిల్ సమీపలో వెలసిన విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకేతు పూజలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు హాజరై అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన దీపాలను వెలిగించి పూజించారు. పూజకు హాజరైన భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించినట్లు ఆలయ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 వరకు రాహుకాల పూజలు చేశారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా తెలిపారు. మంగళవారం యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా స్థానిక మహిళా పోలీసు స్టేషన్ నుంచి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు క్రిష్టారెడ్డి, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు ఆఫ్‌పోలీసు రాజు, మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్ శాంత, పోలీసులు సహదేవరెడ్డి ఫ్యామిలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ క్రిష్టారెడ్డి మాట్లాడుతూ ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని, భౌతికంగా లేదా మానసికంగా లేదా వేరే ఇతర మాటల ద్వారా ఒక విద్యార్థి మరొక విద్యార్థిని బాధపెట్టడం, హింసించడం రాగింగ్‌గా పరిగణించబడుతుందన్నారు.

యూటీఎఫ్ నూతన కమిటీలో వేంపల్లెకు స్థానం



కృష్టారెడ్డి, శ్రీనివాస్, టీవీ రమణ

వేంపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన యూటీఎఫ్ జిల్లానూతన కమిటీలో వేంపల్లె మండలానికి చెందిన ముగ్గురికి స్థానం దక్కింది. యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగాయి. జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్-2లో తెలుగు అధ్యాపకునిగా పనిచేస్తున్న ఉపాధ్యాయలు చెరుకూరు శ్రీనివాసులు మరోసారి జిల్లా కార్యదర్శిగా ఎంపికయ్యారు. అలాగే పాములూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో స్కూల్ అసిస్టెట్ మ్యాథ్స్‌గా పనిచేస్తున్న కృష్టారెడ్డి రాష్ట్ర కౌన్సిలర్‌గా, మ్యాథ్స్‌స్కూల్ అసిస్టెంట్ పనిచేస్తున్న టివి రమణ జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్‌గా ఎంపికయ్యారు.

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఏఓ రమేష్

లింగాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సమగ్ర యాజమాన్య చర్యలతో అరటిలో అధికదిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. మండలంలోని మురారి చింతల గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులతో మాట్లాడుతూ సమగ్రయాజమాన్య చర్యలతోపాటు ప్రకృతి వ్యవసాయం చేయాలనిపిలుపునిచ్చారు. అలాగే లింగాలలో రైతులకు 350క్వింటాళ్ల విత్తన శనగలను పంపిణీ చేశామని తెలిపారు. ఇప్పటి వరకు 981క్వింటాళ్ల శనగలను రైతులకు పంపిణీ చేశామని తెలిపారు. విత్తన శనగలు పొందిన ప్రతి రైతుపంటను తప్పనిసరిగా సాగుచేయాలన్నారు.

14 గ్రామ పంచాయతీల్లో తనిఖీ


జమ్మలమడుగులో ఓపెన్ ఫోరం సమావేశం

జమ్మలమడుగు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండల ఉపాధి హామీ పథకంలో 19వ విడత సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి అడిషనల్ పీడీ నాగరత్నమ్మ, ఏపీడీ రామలింగేశ్వరరెడ్డి తదితరులు హాజరయ్యారు. సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో తనిఖీలు చేశామన్నారు. ఉపాధి హామీ పథకం సంబంధించి 1.4.2023 నుంచి 31.3.2024 సంవత్సరానికి తనిఖీ నిర్వహించి సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఎంపీడీవో సైదున్నీసా, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈవోపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న డిప్యూటీ డీఈవో క్రిష్ణప్పపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం ఉప విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు మాట్లాడుతూ డిప్యూటీ డీఈవో క్రిష్ణప్ప కార్యాలయంలో ఎప్పుడూ అందుబాటులో ఉండరని, ఎప్పుడు ఫోన్ చేసినా స్పందించరని విమర్శించారు. వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చినా ఆయన అందుబాటులో ఉండరన్నారు. కార్యాలయంలో సీసీ లేకపోవడంతో ప్రభుత్వ ఉపాధ్యాయుల బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయని తెలిపారు. ఫైల్‌కు ఒక రేటు పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆయన అవినీతిపై విచారణ జరిపి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు గంగయ్యకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌వైఎఫ్ నాయకులు బయన్న, శ్రీను, చెన్నమ్మ, నరసింహులు, ప్రతాప్‌రెడ్డి, భాస్కర్, సుందర్ పాల్గొన్నారు.

కాలువ నిర్మాణ పనులకు భూమి పూజ

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలోని లింగాపురంలో కాలువ నిర్మాణ పనులకు సర్పంచ్ కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి భూమి పూజ చేశారు. మంగళవారం ఉదయం లింగాపురంలోనున్న జర్నలిస్టు కాలనీలో రూ.8 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ హర్షవర్ధన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో ట్రాఫిక్ కష్టాలు..!

● నిర్లక్ష్యంగా రోడ్డుపై నిలిపిన వాహనాలు ● అంబేద్కర్ విగ్రహం పక్కన ఆక్రమణలు ● పార్కింగ్ లేక వాహనదారులకు అవస్థలు

జమ్మలమడుగు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు డివిజన్ కేంద్రం. పాత బస్టాండు నుంచి నాన్‌స్టాప్ సర్వీసుల వద్ద పెద్దపసుపుల మోటు వరకు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిర్లక్ష్యంగా నిలిపినా ఇక్కడ పోలీసులు పట్టించుకోరు. ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా 108 వాహనం నిలుపాలన్నా ఇబ్బందికరంగా ఉంటుంది. ఆదారిలో తోపుడుబండ్ల వ్యాపారులదే రాజ్యం. రోడ్డుకు డ్రైనేజీ కాలువ దిగి ఆక్రమణ చేసి వ్యాపారాలు సాగిస్తున్నా పోలీసు అధికారులు చూసీచూడనట్లు వెళుతున్నారు. అలాగే ఇతర వ్యాపారస్థులు వారి వారి సరుకులను పగలే రోడ్డుపై నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ దిగుమతి చేసుకుంటున్నా పోలీసు యంత్రాంగం పట్టించుకోదని బహిరంగ ఆరోపణలున్నాయి. పాత బస్టాండులోని నాన్‌స్టాప్ సర్వీసుల వద్ద రోడ్డు గుంతలు దర్శనమిస్తున్నా అధికారుల్లో చలనం లేదని ప్రజలు వాపోతున్నారు. అలాగే గాంధీ విగ్రహం రోడ్డు పక్కనే పండ్ల వ్యాపారులు తోపుడుబండ్లను బస్సులకు ట్రాఫిక్ అడ్డంగా పెట్టుకున్నా పోలీసు చర్యలు లేవు. ఇక కూరగాయల మార్కెట్ వీధిలో అన్నీ అడ్డంకులే. ఇంత సమస్య ఉన్నా ఏ ఒక్క అధికారి పట్టించుకోరు. అంబేడ్కర్ విగ్రహం, తహసీల్దారు కార్యాలయం పక్కన ఆక్రమణలు ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు వాటి జోలికి వెళ్లాలన్నా భయపడుతున్నారని ప్రజలే బహిరంగంగా చెప్పుకోవడం విశేషం. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం దగ్గరలో ద్విచక్ర వాహనాలు నిలుపాలన్నా ఇబ్బందికరంగా మారింది. జమ్మలమడుగు పట్టణంలో ప్రధానంగా వాహనదారులకు పార్కింగ్ సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. పోలీసు అధికారులు ట్రాఫిక్‌ను పర్యవేక్షించి రోడ్డుపై ఆక్రమణచేసి వ్యాపారాలు కొనసాగించే తోపుడుబండ్ల యజమానులకు నోటీసులు ఇచ్చి కేసులు నమోదు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైన పోలీసు అధికార యంత్రాంగం జమ్మలమడుగు ట్రాఫిక్, ఆక్రమణలపై వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులు సైతం తోడ్పాటు అందించాలని పలువురు కోరుతున్నారు. ఈ సమస్యలపై గతంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ట్రాఫిక్ సమస్యలు రాకూడదని గతంలో ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పోలీసు అధికారులకు అప్పట్లో సూచించినా స్థానిక పోలీసు అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వినపడుతున్నాయి.



ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా రోడ్డుపై నిర్లక్ష్యంగా నిలిపిన వాహనాలు

మొబైల్ ఆధార్ కేంద్రాలు

ముద్దనూరు, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ సచివాలయల్లో మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ముకుందారెడ్డి తెలిపారు. 23 వ తేదీ ముద్దనూరు గ్రామ పంచాయతీ కార్యాలయం,24వ తేదీ యామవరం గ్రామ సచివాలయం,25 వ తేదీ కొర్రపాడు గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంప్ ఉన్నట్లు తెలిపారు.మొబైల్ నంబరుకు ఆధార్ లింకు, వేలిముద్ర అప్‌డేట్, ఫొటో మార్పు, చిరునామా మార్పు ఇతర సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

ఎర్రగుంట్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మొబైల్ ఆధార్‌సెంటర్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటరమణయ్య ప్రజలను కోరారు. ఆధార్ అప్‌డేట్, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించు కునేందుకు ప్రత్యేక మొబైల్ ఆధార్ కేంద్రాలను మంగళవారం ఏర్పాటు చేశారు. చిన్నదండ్లూరులోని కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు.

ఆధార్ తప్పులు సరిచేసుకోవాలి

ఖాజీపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆధార్‌కార్డులో ఉన్న తప్పులు సరిచేసుకోవాలని ఎంపీడీవో దివిజసంపతి అన్నారు. మంగళవారం ఖాజీపేట సచివాలయం-2 నిర్వహిస్తున్న ఆధార్ సేవలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

25న జాబ్‌మేళా

పోరుమామిళ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 25నజాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సగిలి ప్రకాశరావు తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు.

ఎల్‌ఐసీ బ్రాంచ్ నూతన కమిటీ ఎన్నిక

జమ్మలమడుగు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఎల్‌ఐసీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కమిటీ 14వ సర్వసభ్య సమావేశం జరిగింది. మంగళవారం జమ్మలమడుగు పట్టణంలోని పతంగే ఫంక్షన్ హాలులో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆల్‌ఇండియా లియాఫి ప్రెసిడెంట్ జంపాల క్రిష్టారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జయభారత్‌రెడ్డి, లియాఫి మెంబర్లు హాజరయ్యారు. ఈ సమావేశంలో జమ్మలమడుగు అధ్యక్షుడు శివరామిరెడ్డి, సెక్రటరి గురుశేఖర్, ట్రెజరర్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో వారి సమక్షంలో జమ్మలమడుగు ఎల్‌ఐసీ బ్రాంచ్ నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అందులో అధ్యక్షుడుగా గురుశేఖర్, సెక్రటరి శేఖర్‌యాదవ్ తదితరులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసీ బ్రాంచ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

ఇటుకల బట్టీలకు ఇసుకను అందించాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటుకల బట్టీలకు ఇసుకను అందించాలని సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దారు గంగయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య మాట్లాడుతూ జీవనోపాధికోసం పట్టణ శివార్లలో ఇటుకల బట్టీలు ఏర్పాటు చేసుకుని కొంతమంది జీవనం గడుపుతున్నారని తెలిపారు.

తహసీల్దారును సన్మానించిన టీడీపీ నాయకులు



ఖాజీపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు మహబూబ్‌బాషను టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో టీడీపీ నాయకులు నెల్లూరప్ప, కొత్తపేట బుచ్చిరెడ్డి, రామసుబ్బయ్య, శ్రీనివాసులు, గురివిరెడ్డి తదితరులు శాలువాతో సత్కరించారు.

నామినేటెడ్ పదవులలో సీనియర్లకు న్యాయం చేయాలి

ప్రొద్దుటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పదవులలో పార్టీ కోసం కష్టపడిన సీనియర్లకు న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి సీఎం చంద్రబాబును కోరారు. మంగళవారం విజయవాడలో టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు ను కలిశారు. త్వరలో చేపట్ట బోయే నామినేటెడ్ పదవుల్లో పార్టీకోసం త్యాగం చేసినవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు భద్రతా నిబంధనలు తప్పక పాటించాలి : ఎస్‌ఐ

కాశినాయన అక్టోబరు(ఆంధ్రజ్యోతి)22:వాహన చోదకులు రోడ్డుభద్రతా నిబంధనలను తప్పక పాటించాలని కాశినాయన మండల ఎస్‌ఐ హనుమంత్ పేర్కొన్నారు. మంగళవారం ఓబుళాపురం మూడురోడ్ల కూడలిలో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రిబుల్ రైడింగ్, మైనర్‌లు వాహనాలు నడపడంలాంటివి చేస్తే కఠినచర్యలు తప్పవన్నారు.హెల్మెట్,డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీలేని పలువురు వాహనదారుల నుంచి రూ.1915 అపరాధ రుసుము వసూలు చేశారు.

బి.కోడూరులో రెవెన్యూ గ్రామసభ

బి.కోడూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బి.కోడూరు గ్రామ పంచాయతీలో మంగళవారం రీసర్వేలో వచ్చిన భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామసభలు తహసీల్దారు మధునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గతంలో రీసర్వే జరిగిన గ్రామాల్లోని రైతుల భూసమస్యలు ఎక్కువగా ఉండడంతో రైతులు తమ తమ అర్జీలను గ్రామసభలో తహసీల్దారుకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయరు సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు

దువ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలోని నీలాపురం, సుగాలితాండ మార్గమధ్యంలో కల్వర్టు నిర్మాణానికి రూ.45 లక్షల నిధులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ మండల ఏఈ సుబ్రమణ్యం తెలిపారు. ఈమేరకు కల్వర్టు నిర్మించాల్సిన స్థలాన్ని పంచాయతీరాజ్ జేఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈ మధుసూదన్‌రెడ్డి పరిశీలించినట్లు ఆయన చెప్పారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను టీడీపీ కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎండీ నజీర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ప్రొద్దుటూరు నుంచి ఎర్రగుంట్లకు ఆర్టీసీ బస్సులో టిక్కెట్టు కొని ప్రయాణించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిందని, అవి అమలుకావడంలేదని విమర్శించారు.

మెయింటెనెన్స్ వర్కులు చేపట్టాలి

ప్రొద్దుటూరు , అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పార్కులో ఎప్పటికప్పుడు మెయింటెనెన్సు వర్కులు చేపట్టాలని కమిషనర్ మల్లికార్జున ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ గాంధీ పార్కు,వైఎంఆర్ కాలనీలోని పార్కు, ధర్డ్ కాలనీ పార్కును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ దిల్‌షాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి

బద్వేలు, అక్టోబరు22,(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థిని హత్యచేసిన విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పెద్ద ఎత్తున ర్యాలీ, నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌లు మాట్లాడుతూ హంతకుడు విఘ్నేష్‌కు కఠినంగా శిక్షించడంతో పాటు మృతురాలి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అనిల్, రామ్ ప్రసాద్, హరిశంకర్, తదితరులు పాల్గొన్నారు. కాగా మానవమృగం విఘ్నేష్ చేతిలో అతి కిరాతకంగా హత్యకు గురైన విద్యార్థిని కుటుంబాన్ని మంగళవారం సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర తన బృందంతో వెళ్లి పరామర్శించారు. ఈకార్యక్రమంలో సీపీఐ నేతలు వీరశేఖర్, పిడుగు మస్తాన్, బాలు, పివి.రమణ, ఇమ్మానుయేల్, పెంచలయ్య, విజయమ్మ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: బద్వేలులో విద్యార్థినిపై జరిగిన అఘాయిత్యంపై జమ్మలమడుగు పాత బస్టాండు గాంధీ విగ్రహం వద్ద మంగళవారం రాత్రి జమ్మలమడుగు దూదేకుల సంఘం (నూర్ బాష) అధ్యక్షుడు పీరయ్య, ఉపాధ్యక్షుడు చిన్నపీరయ్య ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దూదేకుల సంఘం నాయకులు కుళాయిస్వామి, అశోక్, బెల్లంకొండ దస్తగిరి, ఆర్యన్, సునీల్, కిరణ్, జనసేన పార్టీ అధికార ప్రతినిధి వనం గురుకుమార్, తదితరులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు..కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దూదేకుల సంఘం

విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.5లక్షలు ఆర్థికసాయం


చంద్రబాబుతో మాట్లాడుతున్న రితేష్‌కుమార్‌రెడ్డి

బద్వేలుటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సెంచరీప్లైవుడ్ సమీపంలోని అటవీప్రాంతంలో ప్రేమోన్మాది ఘాతుకానికి బలైన ఇంటర్ విద్యార్థిని కుటుంబానికి చంద్రబాబు ప్రభుత్వం తరుపున రూ.5లక్షల రూపాయలు ఆర్థిక సాయాన్ని మంజూరుచేసినట్లు టీడీపీ యువనేత రితేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జరిగిన ఘటనపై మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌కుమార్‌రెడ్డి, బొజ్జ రోశన్న మంగళవారం అమరావతిలో చంద్రబాబును కలసి పరిస్థితిని పూర్తిగా వివరించారు. దీంతో చంద్రబాబు వెంటనే బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరుపున రూ.5లక్షల రూపాయలు ప్రకటించారని వారు తెలిపారు. అలాగే బాధితురాలి తమ్ముడి ఉన్నత విద్యకు విజయవాడలోని ఎన్టీఆర్ మోడల్‌స్కూల్లో ఉచిత విద్యాబోధనను అందించేందుకు సీటుకూడా మంజూరు చేసినట్లు వారు తెలిపారు. ఈ ఆర్థికసాయాన్ని నేడు కలెక్టర్ చేతులమీదుగా బాధితురాలి కుటుంబానికి అందజేయనున్నట్లు వారు తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే



ప్రొద్దుటూరు , అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నెహ్రూరోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ముఖ్య నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సురేష్‌నాయుడు, వీఎస్ ముక్తియార్, ఆసం రఘురామిరెడ్డి, ఈవీ సుధాకర్ రెడ్డి,ఘంటశాల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్లు వార్డు, ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.